# తెలంగాణ ముచ్చట్లు


TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

సంపుటి : 2 | సంచిక : 283 | శనివారం | 08 - 03 - 2025 | పేజీలు : 8 | వెల : 5.00 | www.telanganamuchatlu.in


## ఐపీఎస్ అధికారుల బదిలీ




**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

తెలంగాణలో మళ్లీ ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. తాజాగా 21 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీపీలు, ఇద్దరు డీఐజీలు బదిలీలు అయ్యారు. అదనపు డీజీ(పర్సనల్)గా అనిల్ కుమార్, ఎస్పీఎఫ్ డైరెక్టర్‌గా అనిల్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఐడీ ఐజీగా ఎం శ్రీనివాసులు, రామగుండం సీపీగా అంబర్ కిశోర్ ఝా, వరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్, ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధూశర్మ, మహిళా భద్రత విభాగం ఎస్పీగా చేతన, నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా రూపేశ్, కామారెడ్డి ఎస్పీగా రాజేశ్ చంద్ర, నిజామాబాద్ సీపీగా సాయిచైతన్య, సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్, కరీంనగర్ ఎస్పీగా గౌస్ ఆలం, ■ మిగతా 6లో..



## కాంగ్రెస్ ఓటమికి..
# కారణం ఎవరు?

- ▶▶ సర్కార్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయంగా గట్టి ఎదురు దెబ్బ..?
- ▶▶ సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలోకి దిగినా అనుకున్న ఫలితాలు రాలేదు..?
- ▶▶ మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో అధికార పార్టీని తోసిరాజని రెండింటిని బీజేపి కైవసం..
- ▶▶ రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెల్చుకోవడంతో బీజేపీలో జోష్
- ▶▶ స్థానిక సంస్థల్లోను కమలం పార్టీదే హవా..?
- ▶▶ రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికార పీఠం దక్కించుకునే దిశగా ముందుకు..!

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయంగా గట్టి ఎదురు దెబ్బ తగిలింది. తెలంగాణలో జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో అధికార పార్టీని తోసిరాజని రెండింటిని బీజేపీ తన్నుకుపోయింది. సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ఇప్పుడు రాజకీయంగా ఇరకాటంలో పడిందనే చెప్పాలి. అధికార పార్టీ హోదాలో కాంగ్రెస్ ఒక్క ఎమ్మెల్సీ స్థానం గెలవకపోవడం రేవంత్ సర్కార్‌కు పెద్ద దెబ్బగా కాంగ్రెస్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. స్వయాన సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలోకి దిగినా అనుకున్న ఫలితాలు రాలేదు. సిట్టింగ్ స్థానం కోల్పోవడమే కాకుండా అది తమ బద్ధ శత్రువైన బీజేపీ ఖాతాలో పడటం హస్తం నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. 15 నెలల అధికారంలో తాము అన్ని హామీలు నెరవేర్చుతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తూ వచ్చింది. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రచారం చేసినా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ కోల్పోయింది. బీసీ నినాదంతో కాంగ్రెస్ లబ్ధి పొందాలని ప్రయత్నం చేసినా అది బూమ్ రాంగ్ అయింది. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిలుపుకున్న వైనానికి ఈ ఫలితాలు సాక్ష్యంగా ఉన్నాయి. ఉమ్మడి కరీంగనర్ - నిజామాబాద్- ఆదిలాబాద్- మెదక్ జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజి రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిపై 5, 106 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. హోరా హోరీ ఇద్దరి మధ్య విజయం దోబూచు లాడినా, రెండో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపుతో బీజేపి ముందుకు పోగా, కాంగ్రెస్ పార్టీ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన కొమరయ్య గెలుపొందారు. ఇలా ఉత్తర తెలంగాణలో కీలకమైన రెండు స్థానాలను బీజేపీ గెల్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలిందని చెప్పాలి. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రెండు ప్రతిష్టా త్మకంగా తీసుకున్నాయి. ఇక బీఆర్‌ఎస్ ఈ ఎన్నికల బరి నుండి తప్పుకుంది. దీంతో రెండు జాతీయ పార్టీలు గెలుపు కోసం తీవ్రంగా పని చేశాయి. కరీంనగర్ - నిజామాబాద్- ఆదిలాబాద్ - మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 15 జిల్లాలు, 42 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అంటే అక్కడి పట్టభద్రుల తీర్పుగా ఈ ఎన్నికల ఫలితాన్ని చూడాల్సి ఉంది. అంతే కాకుండా ఇది నేరుగా రెండు జాతీయ పార్టీల మధ్య పోటీ. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్- బీజేపీలు పోటీ పడు తున్నాయి. తమకు బలం లేని చోట మిత్రపక్షాల కూటములతో పోటీ పడుతున్నాయి. అయితే ఇక్కడి ఎన్నికల్లో రెండు పార్టీలు నేరుగా పోటీ పడటంతో అటు కాంగ్రెస్ సర్కార్, ఇటు బీజేపీ రెండు చాలా ప్రతిష్టాత్మకంగా ఈ ఎన్నికలను తీసుకున్నాయి.

బీజేపీ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా ఈ ఎన్నికలను తీసుకుని పని చేశారు. అటు సీఎం రేవంత్ రెడ్డి, పీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు అదే రీతిలో ప్రచారం చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెల్చుకో వడంతో బీజేపీలో జోష్ పెరిగింది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ట్రాయంగిల్ పోటీని ఎదుర్కొన్న కాషాయం పార్టీ 8అసెంబ్లీ స్థా నాలను, 8 ఎంపీ స్థానాలను గెల్చుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీతో జరిగిన ఎమ్మెల్సీ పోరులో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు గాను రెండు బీజేపీ ఖాతాలో పడ్డాయి. దీంతో రాష్ట్రంలోని చట్ట సభల్లో కాషాయ పార్టీకి పది మంది సంఖ్యా బలం అంటే రెండు అంకెల స్కోరుకు చేరడం విశేషం. ఓవరాల్‌గా 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు కేంద్ర మంత్రులు, మరో ఆరుగురు ఎంపీలు, ఒక రాజ్య సభ సభ్యుడు, తాజాగా ఇద్దరు ఎమ్మెల్సీల బలం బీజేపీది. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల గెలుపుతో కమలం పార్టీ ఉత్తర తెలంగాణలో తన బలాన్ని సుస్థిరం చేసుకుందనే చెప్పాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కమల నాథులు ఇప్పటి నుండే కసరత్తు ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ బరిలోకి దిగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ పార్టీ ఒక్క స్థానం గెలవలేక పోయింది. బీఆర్ఎస్‌కు తమ విజయాలతో చెక్ పెట్టడం ద్వారా కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ నేతలు చెప్పుకునే పరిస్థితి కల్పించారు. స్థానిక సంస్థల్లోను కమలంను వికసింపజేస్తే ఆ తర్వాత టార్గెట్ తెలంగాణ అధికార పీఠమేనని పార్టీ నేతలు చెబుతున్నారు. ఆ దిశగా ఇప్పటికే.. ■ మిగతా 6లో..

## పాలమూరు-రంగారెడ్డి
# ప్రాజెక్టుపై విచారణ..



**న్యూ ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు :**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అక్రమాలు జరిగాయంటూ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని ఉన్నత న్యాయస్థానాన్ని మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి ఆశ్రయించారు. అవినీతిపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని ఆయన కోరారు. కాగా, దీనిపై ఇవాళ విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజీవ్ కుమార్‌ల ధర్మాసనం నాగం, మేఘా సంస్థ తరపు వాదనలు విన్నారు.మరోవైపు గతేడాది డిసెంబర్‌లో విచారణ సందర్భంగా ఇచ్చిన ఆదేశాల మేరకు బేల్ అఫిడవిట్ దాఖలు చేసింది. ఎత్తిపోతల పథకానికి సరఫరా చేసిన యంత్రాలు, తమకు వచ్చిన బిల్లులు, తదుపరి తమ బాధ్యత వంటి విషయాలను అఫిడవిట్‌లో పేర్కొంది. బేల్ సంస్థ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలు తాము చేసిన ఆరోపణలను నిజం చేస్తున్నాయని నాగం తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి తెలిపారు. ప్రభుత్వ టెండర్‌లో మూడో వంతు కూడా బేల్ సంస్థకు చెల్లించలేదని అఫిడవిట్‌లో చెప్పిన అంశాలు స్పష్టం చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా బేల్ దాఖలు చేసిన అఫిడవిట్, దానికి నాగం ఫైల్ చేసిన రిజాయిండర్లను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు.ఈ వ్యవహారంలో తెలంగాణ

## కవితకు రఘునందన్
# మాస్ సవాల్



**సిద్దిపేట జిల్లా. తెలంగాణ ముచ్చట్లు :**


బీసీలకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శలు చేశారు. గజ్వేల్ పట్టణంలో (శుక్రవారం) మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. కవితకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్‌తో మాట్లాడి పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీకి ఇప్పించాలని సవాల్ విసిరారు. శాసనసభలో పార్టీ ప్రతిపక్ష నాయకుడిని బీసీ నేతకు ఇవ్వండి. శాసన మండలిలో కూడా మరో బీసీ నేతకు ఇవ్వాలని ఛాలెంజ్ చేశారు. ఇచ్చిన నాలుగు మంత్రి పదవులు బీసీలకు ఎందుకు ఇవ్వరని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు.ఈటెల రాజేందర్ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు బీసీల్లో పెద్ద సామాజిక వర్గానికి చెందిన ఈటెలను మధ్యలోనే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేసీఆర్ కుటుంబానికి పదవులు కావాలి.. మరి బీసీలకు పదవులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ రోజు ఫామ్‌హౌస్ చర్చలో కేసీఆర్‌తో తాను చెప్పిన విషయంపై కవిత మాట్లాడాలని సవాల్ విసిరారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అవకాశం వస్తే బీజేపీలో ఒక మహిళకు ఇచ్చామని గుర్తుచేశారు. మొదటి ఐదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వలేని ఒకే ఒక కేబినెట్ ఈ దేశంలో ఏదైనా ఉంటే అది కేసీఆర్ కేబినెట్ అని విమర్శించారు. బీజేపీని విమర్శించే ముందుగా బీఆర్ఎస్ చేసిన తప్పులు సరిదిద్దుకోవాలని చెప్పారు. బీజేపీ వైపు వేలెత్తి చూపించే బదులు ముందుగా బీఆర్ఎస్ నేతలు తప్పులు సరిదిద్దుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు హితవు పలికారు.

## కాల్ సెంటర్
# స్కామ్ గుట్టు

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :**

హైదరాబాద్‌లో ఘరానా మోసం వెలుగు చూసింది. దిమ్మతిరిగిపోయే కాల్ సెంటర్ స్కామ్ గుట్టు రట్టైంది. నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి విదేశీయులను మోసం చేస్తున్న ముఠాని సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్ కి చెందిన మనస్విని సహా 63 మందిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఎక్సిటో సొల్యూషన్స్ పేరిట మనస్విని కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది. కైవాన్ పటేల్, ప్రతీక్, రాహుల్‌తో కలిసి ఈ కాల్ సెంటర్ ను నిర్వహిస్తోంది. పలువురు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వ్యక్తులని టెలీ కాలర్స్‌గా నియమించుకుంది. అమెరికన్లే ప్రధాన లక్ష్యంగా నిందితులు మోసాలకు పాల్పడుతున్నారు. హ్యాక్ అయిన బ్యాంక్ ఖాతాలు సరి చేస్తామంటూ బాధితులకు ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు సేకరించి నగదు కాజేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 63.. ■ మిగతా 6లో..

# ప్రభుత్వానికి టెన్షన్..?




**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**

మామునూరు ఎయిర్ పోర్ట్ చరిత్ర ఇప్పటిది కాదు. భారత స్వాతంత్ర్యానికి పూర్వమే అంటే నిజాం రాజుల పాలనలో 1930లో దీన్ని నిర్మించారు. చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ దీన్ని జాతికి అంకితం చేశారు. ఇది షోలాపూర్‌లో వ్యాపార అభివృద్ధికి, సిర్పూర్ కాగజ్ నగర్‌లో కాగితపు పరిశ్రమ సౌకర్యార్థం వరంగల్ లో అజాంజాహి మిల్స్ సేవల కోసం ఈ ఎయిర్ పోర్ట్ ఉపయోగపడేది.స్వాతంత్ర్యం తర్వాత పలువురు ప్రధాన మంత్రులు, రాష్ట్ర మంత్రులు ఈ ఎయిర్ పోర్ట్‌కు వచ్చారు. ఇండో చైనా యుద్ధ సమయంలో ఢిల్లీ ఎయిర్ పోర్టును శత్రువులు లక్ష్యంగా చేసుకున్నప్పుడు ప్రయాణికులకు మామునూరు ఎయిర్ పోర్ట్ సేవలు అందించింది. 1875 ఎకరాల స్థలంలో 6.6 కిలోమీటర్ల రన్ వే, పైలెట్ సిబ్బంది గృహాలు, పైలట్ శిక్షణా కేంద్రం, ఒకటికన్నా ఎక్కువ టెర్మినల్లతో దేశంలోనే అతిపెద్ద విమానాశ్రయంగా ఉండేది. కాల క్రమేణ ప్రభుత్వాల నిర్లక్ష్యం, అప్పటి ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనంతో దీన్ని 1981లో మూసివేశారు.తాజాగా రేవంత్ సర్కార్ అధికారంలోకి రాగానే ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష మళ్లీ తెరపైకి వచ్చింది. జీఎంఆర్ అభ్యంతరాలను పరిశీలించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఆ సంస్థను చివరికి ఒప్పించాయి. ఎయిర్ పోర్ట్ అథారిటీ కూడా సమ్మతించడంతో మామునూరు ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఎయిర్ పోర్టుకు మోక్షం కలిగినప్పటికీ.. భూసేకరణ అంశం మాత్రం తెలంగాణ సర్కార్‌కు సవాల్‌గా మారింది. ఒకప్పుడు వరంగల్ నగరానికి శివారు ప్రాంతంగా ఉన్న మామునూరు ఎయిర్ పోర్ట్ పరిసరాల్లో ప్రస్తుతం బహుల అంతస్తుల నిర్మాణాలు, లేఔట్లు వెలిశాయి.రైతుల నుంచి సర్కార్ భూములను సేకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు గ్రామ సభలు నిర్వహించారు. మంత్రి కొండా సురేఖతో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు గ్రామ సభల్లో పాల్గొన్నారు. భూమికి బదులు భూమి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని, ఎవరినీ రోడ్డున పడనివ్వబోమని నిర్వాసితులకు మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. దీంతో మంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాకే భూసేకరణ చేయాలని రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో సమస్య జఠిలమైంది.


## ప్రభుత్వం చిత్తశుద్ధితో
# పని చేస్తోంది



**ఖమ్మం జిల్లా, తెలంగాణ ముచ్చట్లు :**

అర్హులైన వారికి తప్పకుండా రేషన్ కార్డులు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. పేదవారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని 15 నెలలు అయ్యిందని తెలిపారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను కొన్ని పూర్తి చేశాం, మిగిలిన వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3500 ఇళ్లను ఇచ్చే కార్యక్రమం వారంలో ప్రారంభ మవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా తులం బంగారం కొంత ఆలస్యమవుతుందని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టించిందని.. ■ మిగతా 6లో..

# సమాజ పునర్నిర్మాణానికి మహిళలే ఆధారం







సమాజ పురోగతిలో మహిళల పాత్ర అత్యంత ముఖ్యమైనది. పుట్టిన ఒడిలో ఓ బిడ్డను పెంచే తల్లి, కుటుంబాన్ని నిలబెట్టే భార్య, నడిపించే అక్కా-చెల్లెళ్లు, సమాజానికి మార్గనిర్దేశం చేసే గురువు, దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే నాయకురాలు 1 ఇలా ప్రతి భూమికలోనూ మహిళలు తమ అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే మహిళా దినోత్సవం వీరి సాధనలకు గౌరవం తెలిపే రోజు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు వచ్చేందుకు చేసిన పోరాటాలను గుర్తు చేసుకునే రోజు. గతంలో మహిళలు ఎదుర్కొన్న సవాళ్లను, నేడు వారు సాధించిన విజయాలను, రేపటి భవిష్యత్తును విశ్లేషించే అవకాశం కూడా ఇది.

### మహిళల పయనం- సంకల్పానికి ప్రతిరూపం

పురుషాధిపత్య సమాజంలో, మహిళల స్థానాన్ని నిర్దేశించడంలో అనేక అవరోధాలు ఉండేవి. విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయ భాగస్వామ్యం వంటి విషయాల్లో మహిళలు నెమ్మదిగా ఎదిగారు. ఈ రోజు నాసాలో మహిళా శాస్త్రవేత్తలు, అంతర్జాతీయ సంస్థలలో మహిళా నాయకులు, పార్లమెంటులో మహిళా సభ్యులు, వ్యాపార రంగంలో మహిళా సీఈవోలు ఉన్నారు. కానీ ఈ మార్పు ఒక్కరోజులో రాలేదు.

### విద్య-మార్పుకు మూలాధారం

'ఒక మహిళ చదువుకుంటే, ఒక కుటుంబం మారుతుంది" అనే నానుడి ఎంత గొప్పది! విద్య మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, సమాజంలో గౌరవాన్ని ఇస్తుంది. ఒకప్పుడు బడికి వెళ్లడమే కష్టమైన మహిళలు, నేడు డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, ఉపగ్రహాలను ప్రయోగించే పరిశోధకులుగా ఎదుగుతున్నారు.

### ఆర్థిక స్వాతంత్ర్యం -నిజమైన సాధికారత

మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా మారితే అంతకంటే గొప్ప సాధికారత మరొకటి ఉండదు. పురుషాధిక్య వ్యవస్థలో మహిళలు వారి ప్రతిభను నిరూపించుకోవడానికి ఎన్నో అడ్డంకులను అధిగమించాలి. అయితే నేడు స్వయం సహాయ సంఘాలు, స్టార్టప్‌లు, లీడర్‌షిప్‌లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. ఒక చిన్న వ్యాపారం మొదలు పెట్టిన గృహిణి, నేడు బిలియన్ డాలర్ల కంపెనీకి అధిపతిగా మారుతున్న ఉదాహరణలు చాలానే ఉన్నాయి.

### మహిళా సాధికారత -సామాజిక పరిణామం

సమాజ నిర్మాణంలో మహిళలకు సమాన హక్కులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళలకు కావాల్సింది కేవలం గౌరవం కాదు, సమాన అవకాశాలు కూడా. మహిళలకు సమాన ఉపాధి అవకాశాలు, గౌరవప్రదమైన జీవితం, స్వేచ్ఛా భావన ఉన్న సమాజం అవసరం. గతంలో మూస పద్ధతులు, వివక్షను ఎదుర్కొన్న మహిళలు, నేడు తమ హక్కుల కోసం పోరాడుతున్న దృఢమైన వ్యక్తిత్వంగా ఎదిగారు.

### కొండా సురేఖ - ప్రజాసేవకు పరమావధి



పట్టుదల, ప్రజా సంకల్పం ఉన్న నాయకురాలు కొండా సురేఖ మహిళగా రాజకీయాల్లో ఎదగాలంటే కేవలం కుటుంబ నేపథ్యం కాదు, సేవా భావం అవసరం అని ఆమె నిరూపించారు. పేద ప్రజలకు అందుబాటులో ఉండే నాయకు రాలు, అభివృద్ధికి అంకితభావంతో పని చేసే వ్యక్తి.

### సీతక్క - పోరాటం నుంచి నాయకత్వం వరకు



నక్సలైట్ ఉద్యమం నుంచి ప్రజాస్వామ్య రాజకీయాల్లోకి వచ్చిన సీతక్క, తన జీవితాన్ని పేదల అభివృద్ధికి అంకితం చేశారు. విశేషమైన పట్టుదల, సమర్థత ఉన్న మహిళా నాయకురాలు.

### కడియం కావ్య - యువతకు ప్రేరణ



వైద్యురాలిగా సేవ చేసిన కడియం కావ్య, ఇప్పుడు ప్రజా ప్రతినిధిగా పని చేస్తున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలంటే, సమాజ సేవే ధ్యేయంగా ముందుకు రావాలనే స్ఫూర్తిని ఆమె అందిస్తున్నారు.

### ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి - భవిష్యత్ నాయకురాలు



యశశ్వినిరెడ్డి, నూతన తరం రాజకీయ నాయకురాలి ప్రతినిధిగా నిలుస్తోంది. ఆమె విద్యారంగంలో సేవలందించి, తరువాత పాలకుర్తి నియోజ కవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి, ప్రజలకు సేవ చేయడం ప్రారంభించింది. నూతన తరం మహిళా నేతగా, పారదర్శక పాలన, యువత అభివృద్ధి, గ్రామీణ సం క్షేమం వంటి రంగాల్లో తనదైన విధా నాన్ని ప్రదర్శిస్తూ, పాలకుర్తిలో అభివృద్ధిని దిశగా నడిపిస్తోంది.

### తెలంగాణలో మహిళా శక్తి - మార్గదర్శక మహిళలు

తెలంగాణ రాష్ట్రం మహిళా సాధికారతకు గొప్ప ఉదాహరణ. గతంలో రాజకీయాల్లో మహిళల సంఖ్య తక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు రాష్ట్ర పాలనలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా నాయకులు ఉన్నారు. వీరంతా రేపటి యువతకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు.

### మహిళా సాధికారత కోసం సమాజం చేయాల్సినవి

1. సమాన వేతనం, సమాన అవకాశాలు అందించాలి.
2. మహిళా భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
3. కుటుంబాల నుండి ప్రోత్సాహం, సంఘీభావం పెరగాలి.
4. రాజకీయాల్లో, వ్యాపారంలో, విద్యారంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలి.
5. మహిళలను ఉద్దేశించి నెగటివ్ ప్రాపగండాలను నిలువరించాలి.

### భవిష్యత్తు - మహిళలదే

సమాజ పురోగతికి మహిళలు ముందు వరుసలో ఉండాలి. ప్రతి యువతి స్వప్నాలను నెరవేర్చుకోవాలి, సమాజానికి మార్గనిర్దేశం చేయగలగాలి. ఈ మహిళా దినోత్సవం కేవలం ఆచరణాత్మక అభివృద్ధికి ఆరంభం కావాలి.

**'మహిళలు ఎదిగితేనే సమాజం ఎదుగుతుంది!"**

ఈ సందేశాన్ని మనందరం గుండెల్లో నింపుకోవాలి. ప్రతి మహిళ గౌరవంగా జీవించే సమాజం కోసం మనమందరం కృషి చేయాలి. ఈ మహిళా దినోత్సవం, ప్రతి అమ్మాయికి, ప్రతి తల్లికి, ప్రతి నాయకురాలికి, ప్రతి సాధకురాలికి ఒక శుభాశయ సందేశం. ముందుకు సాగండి, సమాజాన్ని మార్చండి!


రాజేష్ బొల్లెపాక,
సీనియర్ జర్నలిస్ట్,
(చీఫ్ ఎడిటర్
తెలంగాణ
ముచ్చట్లు దినపత్రిక)



## ఆమె

'ఆమె' మనం పిలిచిన ప్రథమ పదం.?
ఆమె... అడుగు మన ప్రథమ పథం..??
ఆమె..వొడి పరమపదం.??
ఏ చిత్రకారుడి కుంచె,
ఏ చరిత్ర కారుడి కలమూ
రాయలేదు..పూర్తిగా అమ్మ పదం..??
రెండు లేతపెదాలు కలిపితేగానీ
పలకగలిగేజి
అమృతం చిలకగలిగే పదం అమ్మ.?
తడబడే రెండు చిరుపాదాలను
నడిపించగలిగే కదం అమ్మ.?
వర్షించే ప్రేమని వెనక్కి తోడుకుని
కంటిలో నింపుకునే మింటి నదం అమ్మ.?
మనిషి బాల్యాన్ని తన వెన్నుపై ఎత్తుకునే
బ్రహ్మ రథం-అమ్మ.
బాల్యాన్ని మోసిన వాహనమే కాదు..
మానవత్వపు మజిలీ దగ్గర దిగబెట్టే వాహకమే అమ్మ.?
తనయ,ప్రణయ,సహచరి.మనోహరి.
సహోదరి.సహోద్యోగి .ధరిత్రీ.ప్రకృతీ
క్షమా..ధర్మా...
దశరూపాలూ...అమ్మ స్వరూపాలే.?
మనిషికి తన జీవనాన్వేషణలో..దొరికే నిధనిక్షేపాలే..?
అమ్మ మానవజాతి పెన్నిధి. గౌరవించడం మన విధి..?

డా. ఎ వి గిరిసింహారావ్
సీనియర్ మెడికల్ ఆఫీసర్
ప్రజారవాణా సంస్థ,
ప్రజావైద్యుడు.కవి.రచయిత.సామాజికవేత్త
ఋషి- సంస్థల వ్యవస్థాపకులు
9701450189



### ముస్లిం మైనార్టీ వర్గానికి ఎమ్మెల్యేల కోటాలో

## ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



ముస్లిం మైనార్టీ వర్గానికి ఎమ్మెల్యేలు కోటాలో ఎమ్మెల్సీ కేటాయించాలని మహ్మద్ రసూల్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. క్యాబినెట్ లో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేరని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఎంతమంది మైనారిటీలు కాంగ్రెస్ పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్న ఒక్క నామినేటెడ్ పోస్ట్ ఇవ్వలేదన్నారు. 14 శాతం ముస్లిమ్స్‌లో ఉన్న రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు న్యాయం జరగటం లేదని ఆరోపించారు. నామినేటెడ్ పదవులలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

### అధికార దుర్వినియోగానికి పాల్పడిన

## సీఐ,ఎస్సైలను సస్పెండ్ చేయాలి

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు :**



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు నియోజకవర్గంలోని ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామానికి చెందిన కుర్సపెల్లి రమేష్ అనే వ్యక్తిని అమానుషంగా చితకబాదిన ధర్మసాగర్ సీఐ ప్రవీణ్, ఎస్సై జానీ పాషాలను విధులనుండి తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేనపార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గాదె పృథ్వి పోలీసు ఉన్నతాధికారులను కోరారు. నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఐ ప్రవీణ్, ఎస్సై జానీపా షాలు ఎమ్మెల్యేకు ఊడిగం చేయాలనుకుంటే ఉద్యోగం మానేసి ఎమ్మెల్యే కడియం భజన చేయాలన్నారు. అంతే కానీ చట్టాన్ని కాపాడే పోలీస్ ఉద్యోగంలో ఉంటూ అధికార పార్టీకి తొత్తులుగా మారి అధికార దుర్వినియోగానికి పాల్పడడం దారుణమన్నారు. నిందితుడుపై చట్టప్రకారం కేసు పెట్టి రిమాండ్ చేసే అధికారం మాత్రమే పోలీసులకు ఉందని బాధితుడిపై విచక్షణ రహితంగా దాడి చేసే హక్కు లేదన్నారు. కుటుంబ సభ్యులను తిడుతూ బాధితుడిని కించపరిచే విధంగా వ్యవహరించిన పోలీస్ అధికారులపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు మహమ్మద్ రజాక్, మునిగాల పవన్, బన్నీ, ప్రశాంత్ ఉన్నారు.

### రాజాంలో లీగల్ మెట్రాలజీ

## అధికారుల తనిఖీలు

**శ్రీకాకుళం, తెలంగాణ ముచ్చట్లు :**

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజాం పట్టణంలో లీగల్ మెట్రాలజీ అధికారులు ఫ్రూట్స్ అమ్మకాల దుకాణాలపై తనిఖీలను నిర్వహించారు. పట్టణంలో పండ్ల దుకాణదారులపై తరచుగా వస్తున్న ఫిర్యాదులు మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారులు దామోదర్ నాయుడు, బలరాం కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి కాటాలను పరిశీలించి, తూకాలు సరిగా లేని కాటాలు సిజ్ చేసి పదిమందిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.ఇకపై తూకల్లో తేడాలు వస్తే కఠినమైన చర్యలతో ఉంటాయిని హెచ్చరించారు.

# జానారెడ్డికి కీలక పదవి..?

**నల్గొండ, తెలంగాణ ముచ్చట్లు :**


పెద్దలు జానారెడ్డికి.. ప్రభుత్వంలో పెద్ద పదవి దక్కబోతుందా అంటే.. అవుననే సమాధానమే అన్నిచోట్లా వస్తోంది. దీనికి జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీ కావడమే కారణంగా చూపిస్తున్నాయ్ గాంధీభవన్ వర్గాలు. కేబినెట్‌లోని కొందరు తన మాట వినడం లేదని.. సహకారం లేదని.. బహిరంగంగానే కామెంట్ చేసిన రేవంత్.. పార్టీలో, ప్రభుత్వంలో తనకో పెద్ద దిక్కు కావాలని అనుకుంటున్నారా.. అందుకే పెద్దలు జానారెడ్డిని వ్యూహాత్మకంగా తెరపైకి తెస్తున్నారా? ఇదే నిజమైతే ఒకే కుటుంబానికి మూడు పదవులు అంటే.. కొత్త సమస్యలు తప్పవా.. ఇప్పుడిదే కాంగ్రెస్ నేతల్లో కాకరేపుతోంది.. రేవంత్ ఢిల్లీ టూర్‌కు రెడీ అవుతున్నారు. మంత్రివర్గ విస్తరణతో పాటు కీలక పదవులకు సంబంధించి.. హైకమాండ్‌తో చర్చలు జరిపే చాన్స్ ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇలాంటి పరిణామాల మధ్య సీనియర్ నేత జానారెడ్డి ఇంటికి సీఎం రేవంత్ వెళ్లడం కొత్త ప్రాధాన్యత సంతరించుకుంది. జానారెడ్డితో ఆంతరంగికంగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.కేబినెట్ విస్తరణతో పాటు.. పార్టీలో కీలక పదవుల అప్పగింతల వేళ.. జానారెడ్డితో రేవంత్ భేటీ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఐతే ఇక్కడే అసలు ట్విస్ట్ కనిపిస్తోంది. సలహాల కోసమే కాదు.. సర్‌ప్రైజ్ ప్లాన్ చేసి మరీ జానారెడ్డి ఇంటికి రేవంత్ వెళ్లారనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. ఈ ప్రచారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాలను షేక్ చేస్తోంది.ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా జానారెడ్డిని నియమించాలని రేవంత్ నిర్ణయించారని.. దీని గురించి ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయ్. ఐతే త్వరలో దీనికి సంబంధించి ప్రకటన వచ్చే అవకాశం ఉందనే ప్రచారం కూడా నడుస్తోంది. ఇదంతా ఎలా ఉన్నా.. ప్రభుత్వంతో జానారెడ్డిని భాగం చేయడం వెనక రేవంత్ భారీ స్కెచ్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.పార్టీ మాత్రమే కాదు.. ప్రభుత్వంలోని కొందరు మంత్రుల నుంచే తనకు సహకారం లభించడం లేదని .. ఈ మధ్య పీసీసీ సర్వసభ్య సమావేశంలో రేవంత్ బహిరంగంగానే కామెంట్లు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ మీద, ప్రభుత్వం మీద పట్టు నిలుపుకోవాలంటే.. ఓ పెద్ద సపోర్టు కావాలి.. ఓ పెద్దమనిషి అండ కావాలి. అందుకే పెద్దలు జానారెడ్డికి పెద్దపదవి కట్టబెట్టేందుకు రేవంత్ రెడీ అయ్యారనే చర్చ నడుస్తోంది.జానారెడ్డిలాంటి పెద్దలు తనతో ఉంటే, తన పక్కన ఉంటే.. మరింత బలం లభించే అవకాశాలు ఉన్నాయన్నది రేవంత్ ప్లాన్ అనేది మరికొందరి అభిప్రాయం. నిజానికి పార్టీలో మిగతా సీనియర్లతో పలు సందర్భాల్లో రేవంత్‌కు గ్యాప్ ఏర్పడ్డా .. జానారెడ్డితో మాత్రం మొదటి నుంచి బంధం బలంగానే ఉంది. పీసీసీ చీఫ్‌గా రేవంత్ నియామకంలోనూ జానారెడ్డి పాత్ర కీలకం అనే చర్చ కూడా జరిగింది.రేవంత్‌కు పదవి ఇప్పించేందుకు అధిష్టానంతో జానారెడ్డి స్వయంగా మాట్లాడారనే టాక్ కూడా అప్పట్లో విన్పించింది. ! ఐతే ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పరిస్థితుల మధ్య.. పెద్దలు జానారెడ్డి సపోర్టు రేవంత్‌కు చాలా అవసరం అనడంలో ఎలాంటి అనుమానం లేదు. అందుకే ఆయనను ప్రభుత్వంలో చేర్చి.. తన బలం పెంచుకోవాలన్నది రేవంత్ వ్యూహమనే టాక్ కూడా అప్పుడే మొదలైంది. పెద్దలు జానారెడ్డికి.. పెద్ద పదవి సంగతి ఎలా ఉన్నా.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పెట్టుకున్న నిబంధనల సంగతి ఏంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయ్. ఒక కుటుంబానికి ఒకే పదవి అనే నిబంధన పెట్టుకున్నారు. ఐతే ఇప్పుడు జానారెడ్డికి ప్రభుత్వంలో పదవి అప్పగిస్తే.. ఆయన కుటుంబంలో ముగ్గురికి అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. ఇప్పటికే



ఆయన కుమారుల్లో ఒకరు ఎమ్మెల్యేగా ఉండగా.. మరొకరు ఎంపీగా కొనసాగుతున్నారు. జానారెడ్డికి పదవి అప్పగించాలని సీఎం రేవంత్ నిర్ణయం తీసుకున్నా.. పార్టీపరంగా ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయనే చర్చ కూడా జరుగుతోంది. ఐతే ఒక కుటుంబానికి ఒకే నిబంధన అనే నిబంధన పెట్టుకున్నా.. తెలంగాణలో అది పెద్దగా వర్కౌట్ కాలేదు. వివేక్ వెంకటస్వామి కుటుంబం నుండి ఇప్పటికే మూడు పదవులు ఉండగా?వివేక్ కేబినెట్ రేసులోనూ ఉన్నారనే టాక్ ఉంది. ఇక ఉత్తమ్ కుటుంబానికి రెండు.. కోమటిరెడ్డి ఫ్యామిలీకి రెండు.. కేకే కుటుంబం నుంచి ఇద్దరు పదవుల్లో ఉన్నారు. మరి ఇప్పుడు జానారెడ్డికి లైన్ క్లియర్ అవుతుందా.. ఆయన విషయంలో రేవంత్ ప్లాన్ వర్కౌట్ అవుతుందా?బెడిసి కొడుతుందా అన్నది చూడాలి మరి..

# విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరాలి

- భూపాలపల్లి పౌర సంబంధాల శాఖ అధికారి శీలం శ్రీనివాసరావు
- తల్లి శీలం సరస్వతి జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్, పెన్నుల పంపిణీ చేసిన డిపిఆర్ఓ శ్రీనివాసరావు



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**
చదువు ద్వారానే సమాజంలో గౌరవం పెరుగుతుందని, విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరాలని భూపాలపల్లి జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి శీలం శ్రీనివాసరావు అన్నారు. ఖమ్మం జిల్లా, కల్లూరు స్థానికుడైన శీలం శ్రీనివాసరావు ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్నారు. శుక్రవారం తన తల్లి శీలం సరస్వతి జ్ఞాపకార్థంతో పాటు తాను చదువుకున్న బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులందరికీ పరీక్షా ప్యాడ్స్, పెన్నులు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా శీలం శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రతి విద్యార్థికి గోల్ ఉండాలని, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కనండి వాటిని సాకారం చేసుకోవడంకోసం కృషి చేయాలని సూచించిన ప్రకారం ప్రతి విద్యార్థి తన లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. సమాజంలో చదువే మనిషికి గౌరవాన్ని తెచ్చిపెడుతోందన్నారు. తన తల్లిదండ్రులు కూలిపనులు చేసి తనను ఎంతో గొప్పగా చదివించారని, అలా చదువుకోవడం వల్లనే నేడు జిల్లా అధికారిని అయ్యానని అన్నారు. ప్రతిఒక్కరు తల్లితండ్రులను, గురువులను, సమాజాన్ని గౌరవించి మంచి విద్యార్థులుగా ఎదగాలని, తద్వారా మన సమాజానికి సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్కే మౌలాలి మాట్లాడుతూ... విద్యార్థి ప్రగతికి 10వ తరగతి తొలి పట్టా అని, విద్య మాత్రమే మనిషిని ఉన్నత స్థాయికి చేర్చగలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆ ర్పీలు యాలాద్రి, రాము, వరక రామారావు, ఉబ్బనబాబు రావు,జల్దీ రామకృష్ణ పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి



**చింతకాని బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలో రాయలవీరయ్య భవన్ లో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఏ ఒక్కటి కూడా పూర్తి చేయకపోగా ప్రజలను మోసపుచ్చుతున్నారే తప్ప, ఏ ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. అంతేకాకుండా అన్నం పెట్టే రైతుకు సున్నం పెట్టమన్న సందగా రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించకుండా దళారుల చేతిలో మోసపోయే విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుంది అన్నారు.
రైతు పండించిన మిర్చి ధరలకు ఒకప్పుడు కింటాకు 25 వేల రూపాయలు ధర పల కగా ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవల ం 14 వేల రూపాయలు మాత్రమే చెల్లిం చడం వల్ల రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాక మండలంలో చాలామంది రైతు లు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు మనం చూసామన్నారు. ఈ రైతు ఆత్మహత్యలు ఇలాగే కొనసాగితే రాష్ట్రం అల్ల కుల్లాలం అయితదని ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి రైతు పండించిన మిర్చి పంటకు కనీసం 25 వేల రూపాయలు మద్దతు ధర చెల్లించాలని కోరారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపట్టి పోరాటాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాచబంటి రాము, మండల కమిటీ వత్సవాయి జానకి రాములు, నన్నక్క కృష్ణ మూర్తి తోటకూరి వెంకట నరసయ్య,మద్దిని బసవయ్య,గడ్డం కోటేశ్వరరావు, దేశబోయిన ఉపేందర్, పాల్గొన్నారు

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు మహిళా సోదరీమణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబం నుండి సమాజం వరకు ప్రతిరంగంలో వారు తమ ప్రతిభను చాటుకుంటూ ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని అన్నారు. మహిళా సాధికారతకు విద్య, ఆర్థిక స్వావలంబన ముఖ్యమైనవి అని నామ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తూ పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారని, వారి ప్రగతికి సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నామ తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేసారని షీ టీమ్స్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, బతుకమ్మ చీరెలు, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్టు, కళ్యాణ లక్ష్మీ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మహిళా వ్యాపార వృద్ధికి వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు రాష్ట్రంలో మహిళల స్థాయిని పెంచాయని తెలిపారు. 17వ లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్‌లోనూ, బయటా బిఆర్ఎస్ ఎంపీలు పోరాడిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళలు వ్యాపారం, క్రీడలు, పరిశోధనలు, రాజకీయాలు, సైన్యం వంటి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తూ తమ అసమాన ప్రతిభను ప్రదర్శిస్తున్నారని అన్నారు. సమాజంలో లింగసమానత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మహిళలపై అణచివేత, వివక్ష రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వాలు, ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలు మరింతగా ముందుకు రావాలన్నారు. తెలంగాణలోని ప్రతి మహిళ బలంగా, ఆత్మవిశ్వాసంతో ఎదగాలని ఆకాంక్షిస్తున్నానని, వారి శ్రమ, త్యాగం, నిబద్ధత సమాజ ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో, సమాన హక్కులను అందించడంలో సమాజం ముందుండాలని, అందరూ కలిసి మహిళా శక్తిని గౌరవించాల్సిన అవసరం ఉందని, మహిళలు అన్నిరంగాలలో రాణించినప్పుడే దేశం మరింత పురోభివృద్ధి సాదిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు మరొక్కసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు అన్ని రంగాల్లో విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నానని నామ నాగేశ్వరరావు తెలిపారు.

# వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ప్రఖ్యాత జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శిఖర ప్రతిష్ఠ వేడుకకు ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి శుక్రవారం హాజరయ్యారు. రాష్ట్రం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి స్వామివారి ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.
ఈ కార్యక్రమంలో..: భద్రాద్రి దేవస్థానం మాజీ చైర్మన్ ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా నాయకులు సాధు రమేష్ రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.





## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**
గ్రాడ్యుయేషన్ డే అనేది చిన్న పిల్లలకు పాఠశాల జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయని శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్ చైర్‌పర్సన్ నిష్టాశర్మ అన్నారు. శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హజరైన స్కూల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ చిన్నారులు తమ ప్రాథమిక దశ విద్యను పూర్తి చేసి, తదుపరి దశకు దాటడం కోసం జరు పుకునే ఈ వేడుక రోజు చాలా జ్ఞాపకశక్తిని కలిగించే క్షణాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్నారులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, లక్ష్య సాధన దిశగా కృషి చేస్తారని అన్నారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ ధృవపత్రాలు అం దజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

## పండితాపురంలో నేటి నుండి జాతరకు ముస్తాబైన శివాలయం



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**
నేటి నుండి 11 వ తారీకు వరకు కామేపల్లి మండలం, పండితాపురం గ్రామంలో జరిగే శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణం సందర్భంగా జాతర కార్యక్రమం నాలుగు రోజులపాటు ఘనంగా జరుగుతుందని గ్రామ పెద్దలు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు తెలిపారు. శివాలయం ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో రాజకీయాలు వర్గాలకు అతీతంగా పెద్దలంతా కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయంగా అభివర్ణించారు. ప్రతి ఏటా మహాశివరాత్రి తర్వాత తొమ్మిది రోజులకు పండితాపురం గ్రామంలో అనాది నుండి శివాలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించబడుతుందని, ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడలి తీర్థాల జాతర తర్వాత అతిపెద్ద జాతర గ్రామంలో జరుగుతుందని, ఈ జాతరలో దాదాపు నాలుగైదు జిల్లాల నుండి దాదాపు 50 వేల మంది భక్తులు పాల్గొంటారని, సాంస్కృతిక కార్యక్రమాలతో, ఊరేగింపు కార్యక్రమాలతో జాతర ఘనంగా నిర్వహించబడుతుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఆలయ పూజారి సుగంధం రామలింశీంగేశ్వరశర్మ,, బానోతు నరసింహ నాయక్, మేకపోతుల మహేష్ అంబటిపూడి వెంకటయ్య, మేకల మల్లికార్జునరావు, కొమ్మిని శ్రీనివాసరావు భూక్య నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాదు, దొడ్డ వేణు, జన్నారపు లింగయ్య, పసుమర్తి సత్యం, అంబడిపూడి శ్రీనివాసరావు, బత్తుల ఉపేందర్ శీలం పుల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, గాడిపల్లి సైదులు దొడ్ల మల్లేష్ దండగల దేవేంద్ర అయితన బోయిన సత్యం భానోత్ భీముడు, బత్తుల వీరబాబు, బత్తుల నాగరాజు చల్ల మల్లయ్య మొగిలి శ్రీను, బోడ శ్రీను, శబరినాథ్, దొడ్ల నాగేశ్వరరావు, జలగం శ్రీను పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించగలరు



- గురుకుల డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ యం. సునీత, సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి
- గురుకుల డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- కళాశాలలో రోజువారీ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న మహిళలకు శాలువాలతో ఘన సన్మానం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
మహిళలు అన్ని రంగాలలో రాణించగలరని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ యం. సునీత, సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కొన్ని సంవత్సరాలుగా రోజువారీ కూలీలుగా, పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న పేద మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించి మహిళలంతా సమానులే అని చాటి చెప్పారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థినులు ఎంతో అలరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు గొప్ప గొప్ప విజయాలు సాధించినటువంటి సావిత్రిబాయి పూలే, రమాబాయి అంబేద్కర్, మదర్ థెరిస్సా, ఝాన్సీ రుద్రమదేవి, చాకలి ఐలమ్మ ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము తదితర మహిళల విజయాల గురించి గొప్పగా తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ... ఎన్ని కష్టాలు ఎదురైనా ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కళాశాలలో కోలాహలంగా మహిళా దినోత్సవ వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో పర్యటించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం మధిరలో పర్యటించారు. పర్యటనలో భాగంగా ముందుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కోట రాంబాబు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన తేనీటి విందుకు హాజరయ్యారు. విచ్చేసిన ఎంపీ కి డా.కోట రాంబాబు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఇటీవలే కె.వి.ఆర్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభించిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.


**మధిర రైల్వే గేట్ ప్రాంత పరిశీలన**
అనంతరం మధిర ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం గురించి తెలుసుకొని...ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. గతంలో ఆగిపోయిన రైల్వే సర్వీసుల పునరుద్దరనపై రైల్వే మంత్రి తో మాట్లాడతానని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, యన్నం కోటేశ్వరరావు, టి ఏ సి సభ్యులు అమరవాది సత్యనారాయణ రెడ్డి, కానుగుల రాధాకృష్ణ, సత్యం బాబు, కటికల సీతారామి రెడ్డి, కర్నాటి రామారావు, యట్ల గుంట రమేష్, చావలి రామరాజు, సంగయ్య, కపిలవాయి సత్యనారాయణ రాజు, లక్ష్మారెడ్డి, డేవిడ్, కోట జయరాజు, అక్కినపల్లి నాగేశ్వరరావు, కాశి కోటేశ్వరరావు పాల్గొన్నారు..





## బాధితులకు మెరుగైన వైద్యం కోసం
# ఎల్ఓసిలు అందజేత

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
ఖిల్లా గణపురం మండలం మహమ్మద్ హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన డి. బాల కిష్టమ్మ , కె. వర్షిని అనారోగ్యం తో నిమ్స్ హాస్పిటల్లో జాయిన్ కావడం జరిగింది. బాల కిష్టమ్మకు 2,50,000/-విలువగల ఎల్ఓసిని వర్షినికి 2,00,000 విలువగల ఎల్ఓసి పత్రాన్నిరాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అందజేయడం జరిగింది.ప్రత్యేక చొరవతో చిన్నారెడ్డి ఎల్ఓసి పత్రాలను అందజేసినందుకు బాలకిష్ట మ్మ ,వర్షిని కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ ,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ దేవన్న యాదవ్, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు రఘు, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రేవల్లి తాసిల్దార్ కార్యాలయ నిర్మాణానికి
# రూ. 32 లక్షల నిధులు మంజూరు


GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE:: WANAPARTHY
PROCEEDINGS




GOVERNMENT OF TELANGANA
PANCHAYAT RAJ ENGINEERING DEPARTMENT

**- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అభ్యర్థన మేరకు స్పందించిన మంత్రి**
**- ప్రొసిడింగ్ జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
రేవల్లి మండల తాసిల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం 32లక్షల రూపాయలను మంజూరు చేసింది.వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి అభ్యర్థన మేరకు స్పందించి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ క్రమంలో శుక్రవారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అందుకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను జారీ చేశారు.అడిగిన వెంటనే తాసిల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలంగాణ బాలికల గురుకుల
# పాఠశాలలో మెనూ బెష్



**మెదక్ బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**
జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో స్టేడియం వద్ద గల తెలంగాణ బాలికల గురుకుల కళాశాలలో ఫ్రీ ఫైనల్ పరీక్ష రాస్తున్న పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు, తదుపరి మెనూ అమలు తీరును పరిశీలించి బాలికలతో మమేకమై వారితో కలిసి భోజనం చేసి ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా,విద్యా బోధన,అంశాలను ప్రశ్నలతో పరీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యసాధన శ్రమించాలి భయం వీడి పట్టుదలతో చదవాలి ఎస్ఎస్సి పరీక్షలు జీవితానికి టర్నింగ్ పాయింట్ అని జిల్లా కలెక్టర్ అన్నారు. పట్టుదలతో చదవి మెరుగైన ఫలితాలు సాధించాలని తల్లిదండ్రులకు తమ ఊరికి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, ఎంఈఓ నీలకంఠం,ప్రిన్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# రాజీనామాల పర్వం



**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**
జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా, ఇళ్ల స్థలాల సాధన లక్ష్యంగా జర్నలిస్టులంతా ఐక్యం కావాలని పలువురు జర్నలిస్టులు పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో టీయూడబ్ల్యూజే( ఐజేయు), టీయూడబ్ల్యూజే హెచ్143 యూనియన్లకు చెందిన పలువురు జర్నలిస్టులు ఆయా యూనియన్లకు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా యూనియన్ నాయకులుగా చలామణి అవుతున్న వారు జర్నలిస్టుల జీవితకాల ఇళ్ల స్థలాల సాధన ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సొసైటీ పేరుతో ఇంకా మోసం చేస్తూ పాత్రికేయులను ఏమారుస్తున్నారని మండిపడ్డారు. మంత్రులు, అధికారులు, న్యాయస్థానాలు సొసైటీ ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం సాధ్యపడదు అని తేల్చి చెప్పినప్పటికీ నాయకులు అమాయకులైన జర్నలిస్టులను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని వివరించారు. అలాంటి వారి పక్కన ఉండి తోటి జర్నలిస్టులకు అన్యాయం చేసే ప్రక్రియలో భాగస్వాములం కాదలుచుకోలేదని తేల్చి చెప్పారు. వారి మోసాలను ఎండగట్టేందుకు యూనియన్లకు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి జర్నలిస్టుల రక్షణ, సంక్షేమం, చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని చెప్పారు. రాజీనామా చేసిన వారిలో సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ ఖదీర్ (వి6), దువ్వా సాగర్ (దిశ), కూరాకుల గోపి ( జనం సాక్షి), రాంపూడి నాగేశ్వరరావు(టీవీ 5), మానుకొండ రవికిరణ్( హెచ్ఎంటీవీ ), ఆవుల శ్రీనివాస్ ( సివిఆర్), మారెడ్డి నాగేందర్ రెడ్డి( జర్నలిస్ట్ టీవీ ), జి.యాకేష్ (జీ న్యూస్), కొమెర వెంకటేశ్వర్లు(వి 5), వెగినాటి మాధవరావు( మనమే సాక్ష్యం), ఆర్,అయ్యప్ప (6టీవీ ), ఎం సంజీవరావు( ఆజ్ తక్, ఇండియా టుడే), షేక్ సుభాన్( జనం సాక్షి), దగ్గుపాటి మాధవ్ రావు (బిఎన్‌బి), నాయుడు రామకృష్ణ (మహాన్యూస్ ), నలుబోల మధు శ్రీ ( ఆకాష్ జ్యోతి), కిరణ్ (వి 6), కెమెరా మేన్స్, అర్షద్ ఖాన్ (వి6), ఫయాజ్ (ఐన్యూస్), యూసఫ్( డిడి న్యూస్), యకుబ్ పాషా ( మహా న్యూస్ ), గణేష్ ( హెచ్ఎంటీవీ ), శరత్ (జీ న్యూస్), సతీష్ (6టీవీ), జాకిర్ (సీనియర్ వీడియో జర్నలిస్ట్), హరిప్రసాద్ ( డిఎన్బి న్యూస్ ), గుత్తికొండ నరేష్( సేన), నూకల రామచంద్ర మూర్తి ( దిశా), పెరుమాళ్ళపల్లి నాగార్జున( దిశా), సయ్యద్ అంజాద్ ( దిశా ), మహమ్మద్ రియాసతుల్లా (మున్సిఫ్), షేక్ జానీ పాషా ( రూలింగ్ వన్, దక్కన్ విజన్), రంగా నాగేశ్వరరావు( సివిఆర్ ), ఉపేందర్ (దిశ), అన్సార్ పాషా (స్వేచ్ఛ), బెల్లంకొండ రాజేంద్రప్రసాద్( ఐ డ్రీమ్), దేవేందర్ (ఆర్ టీవీ), ఇంద్రసేన (ఉప్పెన), అశోక్ (యువగళం ), రవి( ఏబీఎన్ కెమెరామెన్) తదితరులు ఉన్నారు.

# డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు మహర్ధశ



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
వనపర్తి నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం 4,66,94,238 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రొసీడింగ్స్ జారీ చేయడం జరిగిందని తెలిపారు.వనపర్తి నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు మహర్దశ చేకూరినట్లు వనపర్తి శాసనసభ్యులు సభ్యులు మేఘారెడ్డి పేర్కొన్నారు.గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టి ప్రభుత్వ ధనాన్ని వృధా చేసిందే తప్ప నిరుపేదలకు కేటాయించిన ఇండ్ల నాణ్యతలో మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు.నిరుపేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో, విద్యుద్దీకరణ, తాగునీటి సమస్య, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి నివేదించిన అభ్యర్థన మేరకు స్పందించిన మంత్రి వనపర్తి నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్మించిన 909 డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు గాను 4,66,94,283కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఖిల్లా ఘణపురం మండలంలోని గార్లబండ తండా కు చెందిన 20 డబల్ బెడ్ రూమ్ లకు,కర్నే తండా, షాపూర్‌కు చెందిన 5డబల్ బెడ్ రూమ్‌లకు,కోతుల కుంట తండాకు చెందిన 24 డబల్ బెడ్ రూమ్‌లకు, మామిడిమాడ గ్రామానికి చెందిన 40 డబల్ బెడ్ రూములకు,ముందరితండాకు చెందిన 15 డబుల్ బెడ్ రూమ్ లకు,సల్కేలాపురం గ్రామానికి చెందిన 50 డబుల్ బెడ్ రూమ్‌లకు,తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన 20 డబల్ బెడ్ రూమ్ లకు,పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన 100 డబుల్ బెడ్ రూమ్ లకు,పెబ్బేరుకు చెందిన 24 డబల్ బెడ్ రూమ్ లకు, పెద్దమందడి మండలం బుగ్గ పల్లి తండా కు చెందిన 17 డబల్ బెడ్ రూమ్ లకు,వనపర్తి పీర్లగుట్టకు చెందిన 144 డబల్ బెడ్ రూమ్ లకు,పీర్లగుట్టకు చెందిన 150 డబుల్ బెడ్ రూమ్ లకు,వనపర్తి రాజపేటకు చెందిన 96 డబల్ బెడ్ రూమ్ లకు,వనపర్తి మండలం చిట్యాల కు చెందిన 294 డబులు బెడ్ రూమ్‌లకు నిధులు మంజూరయ్యాయని ఇందుకు సంబంధించిన పనులను వెంటనే చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.అడిగిన వెంటనే స్పందిస్తూ నిధులు మంజూరు చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇంకెన్నాళ్ళు..

ఎన్నాళ్ళూ ఓ పడతీ తిడితే పడుతుంటావు
ఎన్నాళ్ళూ ఓ పడతీ పడుతూ లేస్తుంటావు
తెగువచూపి ఓ మగువ తెగనరుకూ నరకసురుల
ఓ నారీ ఝాన్సిరాణి వారసురాలివి నువ్వు
ఆదిశక్తిఅంశానివి రుద్రమ ప్రతిరూపానివి

కామంతో నిను కబళింప చూసే కాకులను కాల్చెయ్యి
ప్రేమంటునిను వేదించే చీడలను చిదిమెయ్యి
వావీ వరుసలు మరిచి వంకర చూపులు చూస్తె
ఎముకలన్నీ విరిచి రాబందులకేస్తమంటు
పురుషుడితో మీ పుట్టుక తక్కువేమి కాదంటు
దిక్కులన్ని పగిలేట్టు నినదంచూ నీ గొంతుతొ..
అమ్మలా ఆప్యాయత పంచేది ఆడదని
ఆలియై అనురాగం పెంచేది అబలేనని
ఇంటికి దీపమయ్యి వెలుగు పంచుతామంటూ
చెరబట్టచూస్తెమమ్ము మీ పాలిట కొరివౌతామంటూ
దిక్కులన్ని పగిలేట్టు పాడు ఈ “నిర్భయ” గీతం
రాబోయే కాలంలో ఈ రాక్షసక్రీడిట్లె కొనసాగితె
ఆడదాని ఆచూకీ వెదికినాదొరకదంటు
ఆప్యాయత పంచేందుకు అనురాగం పెంచేందుకు
అమ్మా ఆలీ చెల్లి ఒకనాడుండేవారంటూ
చరిత్రలో చదువుకునే రోజే వచ్చిననాడు నదులన్నీ
ఏకమయ్యి నరుడుండే చోటల్లా నాన్పివేసి ఈ సృష్టిని
నాశనమే చేస్తయంటు దిక్కులన్ని పగిలేట్టు
నినదించూ నీగొంతుతొ నిరూపించు నువ్వేంటో..

రావణుడూ కీచకుడు రాక్షసుడెవడైన గాని
మహిళలతో పెట్టుకుని మట్టిలొ కలిసారంటు
నిండు సభన ద్రౌపదినీ అవమానింప చూసిన
అన్నదమ్ముల ఆయుష్షు ఆఖరికీ ఆరింది
ఆడదాన్ని ఆటబొమ్మగ చేసిన రాజ్యాలల్లో
రాళ్ళవర్షమే కురిసి రాజుల ప్రాణాలెగాక
పట్టించుకోని ప్రజలందరి పాపాలను లెక్క కట్టి
నరకానికి సాగనంపి సంబరాలె చేస్తమంటు
దిక్కులన్ని పగిలెట్టూ నినదంచూ నీగొంతుతొ
తెరిపించు మూసుకున్న కళ్ళను నీ వెలుగుతో.?ా

చరిత్ర చెప్పిన సత్యం...!
ఆడపిల్ల పుట్టిందని అమ్మల పై అపవాదు వేసి
కనుతెరవని పసిపాపల కాటికి పంపాలని చూసె
కడుపు నుండి రాకముందె స్కానింగులు తీసుకుంటు
కన్నబిడ్డను సైతం కడతేర్చాలని చూస్తే
తలిదండ్రులతాటతీసి తలకొరివి పెడ్తమంటు

ముళ్ళకంచెలపైన మురికి కూపాలలోన
పసిగుడ్డును వదిలేసే పారవేసె పడతులార
మాతృమూర్తి ప్రేమకు మచ్చమీరు తీసుకువచ్చి
మానవ జన్మను మీరు మలినం చెయొద్దంటూ
ముద్దుమురిపాలెరుగని పసిపాపల ప్రాణంతో
చెలగాటమే ఆడుకుంటె చంపేస్తాం మిమ్మంటూ
ఈ జోల పాటపాడుకో చిట్టి తల్లి మాటనేర్చి..!

రచన
మెట్టు శ్రీధర్
9032181596





# యాగశాలలో ప్రత్యేక పూజలు

**-పొద్దుటూరులో బోనాల వేడుకకు హాజరైన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**
**- డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందినితో కలిసి ఆధ్యాత్మిక వేడుకకు హాజరు**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి శుక్రవారం పొద్దుటూరులో బోనాల వేడుకకు హాజరయ్యారు. బొడ్రాయి, ముత్యాలమ్మ అమ్మవారి పున: ప్రతిష్ఠ సందర్భంగా.. ఉప ముఖ్యమంత్రి సతీమణి మల్లు నందినితో కలిసి.. నాభి శిల వద్ద, యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులంతా పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో.. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, నాయకులు కూరపాటి కిషోర్, కానుగుల రాధాకృష్ణ, గుడిపూడి రజినీకాంత్, కిలారు మనోహర్, కన్నెబోయిన సీతారాములు, మేడా వెంకట్రావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా అనుచరుల పదవులు తొలగించడం కడియంకు తగదు



**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:**
కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్,టిపిసిసి ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరా అనుచరులమని, పార్టీ కోసం నిరంతరం శ్రమించిన సీనియర్ కాంగ్రెస్ నేతల పదవులను తొలగించడం అన్యాయమని, ఇది పార్టీ నైతిక విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి మద్దతుదారులకు అవకాశం కల్పించేందుకు కరుడు గట్టిన కాంగ్రెస్ అనుచరులను పక్కన పెట్టడం బాధాకరమని వారు ఆక్షేపించారు. పార్టీ కోసం సంవత్సరాల తరబడి నిస్వార్థంగా సేవలందించిన నేతల పదవులను హఠాత్తుగా తొలగించడం, కొత్తవారికి పదవులు ఇవ్వడం కాంగ్రెస్ సిద్ధాంతాలకు మచ్చ అని మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్ విమర్శించారు. పార్టీకి అన్యాయంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఉన్నత స్థాయిలో ఫిర్యాదు చేస్తామని నేతలు హెచ్చరించారు.ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మౌనిక, కాంగ్రెస్ మహిళా నాయకురాలు జ్యోత్స్న మాట్లాడుతూ, నిబద్ధతతో పనిచేసిన నాయకులను అవమానించడం సరికాదని, పార్టీ అంతర్గతం గా ఈ విషయాన్ని పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. తాము దీన్ని మౌనంగా సహించబోమని, పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.సీనియర్ నే తల తొలగింపును నిరసిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు భారీగా భగీరథ నినా దాలు చేశారు. అనంతరం కడియం శ్రీ హరికి వ్యతిరేకంగా వినతి పత్రం సమర్పించారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రేండ్ల సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్, మౌనిక, సింగపురం నాగయ్య, చింత జ్యో త్స్న, సదయ్య గౌడ్, పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

# 6 లక్షల సబ్సిడీతో సంచార చేపల విక్రయం వాహనం పంపిణీ

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**60 శాతం సబ్సిడీ తో ఇందిరమ్మ మహిళా శక్తి క్రింద మహిళలకు పంపిణీ**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
6లక్షల సబ్సిడీతో సంచార చేపల విక్రయం వాహనం పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజ మ్మిల్ ఖాన్ తో కలిసి మహిళా లబ్ధిదారులకు 10 లక్షల రూపాయల విలువ గల సంచార చేపల విక్రయం వాహనాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వివిధ వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసి మహిళల స్వాలంబన దిశగా చర్యలు చేపట్టామని అన్నారు. అర్హులైన మహిళలకు 10 లక్షల రూపాయలు విలువ చేసే సంచార చేపల విక్రయం వాహనంను అందిస్తున్నామని అన్నారు. 6 లక్షల రూపాయల సబ్సిడీ, 3 లక్షల రూపాయలు లబ్ధిదారుని వాటా, లక్ష రూపాయల సెర్ప్ బ్యాంక్ లింకేజీ రుణాలతో ఇట్టి వాహనాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఇట్టి యూనిట్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శివ ప్రసాద్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలి

**జఫర్గడ్, తెలంగాణ ముచ్చట్లు :**
ఈ నెల 16న స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో జరిగే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయడంకోసం స్థానిక శాసన సభ్యులు మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆదేశానుసారం మండలంలోని తిమ్మంపేట, లక్ష్మినాయక్ తండా, తీగారం, సూరారం, హిమ్మత్నగర్, తిమ్మాపూర్, గ్రామాల్లో మండల పార్టీ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో పార్టీ ప్రతి గ్రామంలో యువజన, మహిళా, సోషల్ మీడియా కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం జఫర్గడ్ ప్యాక్స్ ఛైర్మన్ తీగల కరుణాకర్ రావు మాట్లాడుతూ...ప్రతి గ్రామం నుండి ఒక్కో బూత్ కు 150మందికి తగ్గకుండా బహిరంగ సభకు వచ్చేలా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భారీగా జన సమీకరణతో వెళ్లి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమాల్లో స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అన్నెపు అశోక్, మారపల్లి ప్రభాకర్, కుల్లా మోహన్ రావు, నూకల అయిలయ్య, బానోతు రాజేష్ నాయక్ ఇల్లందుల శ్రీనివాస్, నియోజకవర్గ, మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి విస్తృత పర్యటన

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రెడ్డి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. మందరపు శ్రీనివాసరావు, జూలకంటి సంజీవరెడ్డి నివాసాలకు.. కాంగ్రెస్ ముదిగొండ మండల నాయకులు దేవరపల్లి అనంతరెడ్డి.. తదితరులతో కలిసి వెళ్లి తేనీటి విందు స్వీకరించారు. మేడేపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి ఇటీవల చనిపోగా.. వారి నివాసానికి వెళ్లి.. ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని అభయమిచ్చారు. వెంకటాపురం గ్రామంలో..: రావూరి వెంకటేశ్వర్లు, కట్ల రంగమ్మల కుటుంబాలను పరామర్శించి.. ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో.. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశే ఖర్, నాయకులు మందరపు శ్రీను, వాకదాని కన్నయ్య, బ్రహ్మారెడ్డి, జూలకంటి సంజీవరెడ్డి, వెంకటేశ్వర్లు, వట్టికూడు సైదులు, సయ్యద్ రఫీ, కొమ్ము ఉపేందర్, రాజు, తాళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆప్కాస్‌ను రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

**పాలకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
రాష్ట్రంలో పురపాలక సంఘాలలో ఉన్న ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కమిటీ ఆధ్వర్యంలో మన్యం జిల్లా కలెక్టర్‌కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించింది. అనం తరం నేతలు విలేకరులు ఉద్దేశించి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నప్పుడు అంతకన్నా మెరుగైన జీవన విధానాన్ని కార్మికులకు అందించాలని కోటమి ప్రభుత్వం అలా చేయకుండా కాంట్రాక్టర్ల చెప్పు చేతల్లోకి కార్మికులను నెట్టాలని చూస్తే మరో పోరాటానికి వెనుకాడబోమని హెచ్చరించారు. 279 జీవోను తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలు చేయాలని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గతంలో చూస్తే దానిపై పోరాడమని గుర్తు చేశారు. జిల్లా పరిధిలో సాలూరులో నేతికి డబ్బులు లేవనే కారణంతో రెగ్యులర్గా జీతాలు చెల్లించడం లేదని ఫిబ్రవరి నెల జీతం కార్మికుల ఖాతాలకు వేయలేదని సభ్యులు నూనెలు చెప్పులు ఇవ్వాల్సి ఉన్న నిధులు లేవనే కారణంతో మంజూరు చేయడం లేదని తెలిపారు. చనిపోయిన కుటుంబాలు ఉద్యోగాలకు సంబంధించి కౌన్సిల్ తీర్మానం అయ్యి రెండు సంవత్సరాలు గడుస్తున్నా కార్మికుల కుటుంబాలకు పోస్టులు వేయలేదని తెలిపారు. సాలూరు పట్టణంలో శ్యామలంబ పండుగ దృష్ట్యా కార్మికులకు సెలవులు ఇవ్వాలని జిల్లాలో పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని జీవో నెంబర్ 36 అమలు చేసి ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని డ్రైవర్ల వేతనాలు జీవో ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు మల్లేష్, సింహాచలం, రాముడు, శంకరు, మహిళా కమిటీ జిల్లా నాయకులు ఇందు నిర్మల, రవి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు, కోశాధికారి సన్యాసిరావు, సిఐటియు నాయకులు సూరిబాబు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యువ ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:**
సమావేశం జిల్లా స్థాయి యువ ఉత్సవ్ ఉత్సవాల్లో ఆరు భాగాలపై దృష్టి సారించి, కార్యాచరణ అంశాల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి అధికారుల సమన్వయంతో పాఠశాలలు, కళాశాలలు సంబంధిత యువజన సంఘాల సంస్థలతో సమన్వయం చేస్తూ, సైన్స్ మేళా ప్రదర్శన వ్యక్తిగత బృందాలు వారిగా కార్యక్రమాలు జరగనున్నాయని జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి ఎమ్. రంజిత్ రెడ్డి తెలిపారు. మార్చ్ నెల 11వ తేదీన ప్రభుత్వ డీగ్రీ కళాశాల లో జరిగే యువ ఉత్సవ్ పోస్టర్‌ని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి జిల్లా యువజన క్రీడాల అధికారి దామోదర్ రెడ్డి చేతులమీదుగా విడుదల చేసారు. ప్రభుత్వ పాఠశాలల్లోనీ, ప్రభుత్వ డీగ్రీ కళశాలల్లోనీ ప్రిన్సిపాల్స్, ఎన్ ఎస్ ఎస్ ఒపిలు, ఎన్‌సిసి, ఏఎన్‌ఓల ద్వారా పాఠశాలలు, కళాశాలలు యువజన సంఘాలు సంస్థలతో సమన్వయం చేయడం ద్వారా యువ ఉత్సవ్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని నెహ్రూ యువ కెంద్ర యువజన సంక్షేమ శాఖ అధికారి ఎమ్. రంజిత్ రెడ్డి కోరారు. జిల్లా స్థాయి యువ ఉత్సవాల్లో ఆరు కార్యక్రమాలకు అర్హత 15–29 సంవత్సరాలు వయస్సు గల వారు 30 సెప్టెంబర్ 2024 నాటికి కల్గిన యువతి యువకులు వారి రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొనవల్సింధిగా జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. సైన్స్ మేళా ప్రదర్శన: (వ్యక్తిగత గ్రూప్) – వివిధ రంగాల లో వినూత్న ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి. యంగ్ రైటర్స్ కాంటెస్ట్: ఇచ్చిన అంశంపై రచనల పోటీ. యంగ్ ఆర్టిస్ట్స్ కాంటెస్ట్: పెయింటింగ్ పోటీ (వివిధ శైలులు). ఫోటోగ్రఫీ పోటీ వర్క్‌షాప్: ఫోటోగ్రఫీ పద్ధతులపై వర్క్‌షాప్ తర్వాత నేపథ్య ఫోటో సమర్పణ. ఉపన్యాస పోటీ: సంబంధిత అంశాలపై ప్రసంగాలు. జిల్లా సాంస్కృతిక ఉత్సవం (గ్రూప్ ఈవెంట్‌లు): స్థానిక కళ మరియు సంస్కృతిని ప్రదర్శించడం జరుగును అని తెలిపారు. జిల్లా యువజన అధికారి అధ్యాక్షతన జరిగిన యువజన ఉత్సవాల కమిటిలో జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి, డీవైఎస్ఓ దామోదర్ రెడ్డి , ప్రభుత్వ డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ , నర్సాపూర్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్, జిల్లా నెహ్రూ యువ కేంద్ర కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్, యెన్. ఎస్. ఎస్ అధికారులు మురళి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## సాగు నీటి సరఫరాపై వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాలి



**మెదక్, తెలంగాణ ముచ్చట్లు :**
సాగునీరు సరఫరాలో ఇబ్బందులు లేకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ తో కలిసి మండల వ్యవసాయ అధికారులు వ్యవసాయ శాస్త్రవేతలతో సాగునీటి వినియోగంపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సమీక్షించారు. యాసంగి వరి పంటకు అందుతున్న సాగు నీటి వినియోగ పరిస్థితిని రిజర్వాయర్ల లోని నీటిమట్టాన్ని అధికారులను అడిగి జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ. ఈ వేసవి ని దృష్టిలో పెట్టుకొని నీరు వృధా కాకుండా నిరంతరం వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కాలువలను సందర్శించాలని నీరు వృధా కాకుండా చూడాలన్నారు. నీటి వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు పొదుపుగా వినియోగించుకునేలా అవగాహన కలిపించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వ్యవసాయ రంగానికి నీటి కొరత రాకుండా చూడాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ సంబంధిత ఆయా మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## మహిళలే మహారాణులు



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఇస్లాం అన్ని మతాల కంటే ముందే స్త్రీ–పురుషుల సమానత్వాన్ని చాటి చెప్పింది. వారిద్దరూ సమానమేనని తెలిపింది. ఇస్లామీయ చరిత్రను పురుషులతో సమానంగా స్త్రీలూ నిర్మించారు. కొన్ని వందల ఏండ్ల క్రితమే ఇస్లాం మహిళల బానిసత్వాన్ని నిషేధించింది. ఆమెకు కుటుంబాన్ని రక్షణగా ఉంచి కుటుంబ బాధ్యతలు అప్పగించింది. సంతానానికి విద్యను నేర్పించాల్సిన బాధ్యతను స్త్రీలకు అప్పగించింది. తల్లిగా, భార్యగా, సోదరిగా మహిళ కుటుంబంలో ప్రధానమైన బాధ్యతలు కలిగి ఉన్నది. ఆమె ఇంటికి మహారాణి. వాస్తవానికి ఆమెకు బయట నిర్వహించాల్సిన బాధ్యతల కన్నా ఇంట్లో నిర్వహించాల్సిన బాధ్యతలే ఎక్కువగా ఉంటాయి. ఆమె శారీరక సామర్థ్యానికి తగినట్టు ఇంటి బాధ్యతలు సరిపోతాయి. అందుకే ఇస్లాం మహిళకు ఇల్లు, పిల్లల పెంపకం బాధ్యతలను ఎక్కువగా అప్పగించింది. ఆడపిల్లగా చిన్ననాడు ఆమె ఇంటకి శుభాన్ని కలిగిస్తూ అందరి ప్రేమాభిమానాలు పొందుతుంది. పెళ్లి అయిన తర్వాత ఆమె వ్యక్తిత్వం ఇనుమడిస్తుంది. పెళ్లి కారణంగా ఆమె అస్తిత్వానికి ఎలాంటి ప్రమాదం రాదు. పైగా ఆమె భర్త ఇంటి యజమాని అవుతుంది. మహిళలు ఇంట్లో నమాజ్, ఆరాధనలు చేసుకోవడానికి ఇస్లాం అనుమతించింది. పురుషులతో పోలిస్తే స్త్రీలు ఎక్కువగా ఉపవాసాలు ఉంటారు. జకాత్ దానాన్ని ఎక్కువగా చేస్తారు. ఆనాడు హజ్, ఉమ్రా యాత్రలను కూడా మహిళలు జిహాద్ (ధర్మ పోరాటం) లాగా భావించి చేసేవారు. ధార్మిక విద్య అభ్యసించడం, నేర్పించడానికి మహిళలకు పూర్తి స్వేచ్ఛ ఉండేది. నేడు కూడా ముస్లిం మహిళలకు విద్య నేర్చుకునే హక్కు కొనసాగుతున్నది. ఆనాడు హజ్రత్ ఆయెషా(ర), హజ్రత్ ఉమ్మె సల్మా(ర), హజ్రత్ ఉమ్మె హబీబా(రజి) లాంటి ధర్మవేత్తలు ఉండేవారు. ఆనాటి స్త్రీలు సమాజ సేవలో, ఇస్లాం సందేశ ప్రచారం, పాలన వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనేవారు. వారికి సామాజిక స్పృహ కలిగి ఉండేవారు. ఇరుగు, పొరుగు స్త్రీల కష్ట సుఖాల్లో పాలుపంచుకునేవారు. ప్రేమ, సానుభూతి వ్యక్తపరిచేవారు. రాజకీయాల్లో నేరుగా పాల్గొనకపోయినా, రాజకీయ పరిస్థితులను పర్యవేక్షించేవారు. ఇస్లామయి రాజ్య పరిరక్షణ కోసం ప్రయత్నించేవారు. ఖలీఫాలు, రాజులకు హిత బోధ చేశారు. దైవ ప్రవక్త(స), ఆయన సహచరులతో పాటు యుద్ధాల్లో పాల్గొన్నారు. ఈ పరంపర నేటి ఆధునిక కాలంలోనూ కొనసాగుతున్నది.

**- ముహమ్మద్ ముజాహిద్, 9640622076**

## బీజేపీ గెలుపు విజయోత్సవ ర్యాలీ

**పెద్దపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**
జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సి విజయోచ్ఛవ ర్యాలీ పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి కమాన్ చౌరస్తా వరకు డీజే సౌండ్, బాణాసంచా శబ్దలాతో, కార్యకర్తల నినాదలా మధ్య నాయకుల నూతన ఉత్సహంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ రెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ బిఆరెస్ కుమ్మకు రాజకీ యాలకు చెరమాగితం పాడిన మేధావి వర్గం, కష్టపడ్డ కార్యకర్తలకు కృతజ్ఞతలు ధన్యవాదలు తెలియచేసారు, ఇదే స్పూర్తితో జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుస్తాం, స్థానిక ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యేల మధ్య జరిగిన చీకటి ఒప్పందం పెద్దపల్లి ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టేముక్కల సురేష్ రెడ్డి, రామగుండం అసెంబ్లీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి, మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, కొప్పుల మహేష్, కూకట్ల నాగరాజు, కందుల శ్రీనివాస్, బిజెపి నాయకులు పల్లె సదానందం, కావేటి రాజగోపాల్, బెజ్జంకి దిలీప్, రాజం మహంత కృష్ణ, ప్రదీప్, చక్రధర్ రెడ్డి, పడాల శ్రీధర్, ఉప్పు కిరణ్, మౌటం నరసింగం, తుడి రవి, అక్కపెల్లి క్రాంతి, కర్ణాకర్, మొలుగూరి రాజా వీరు, సోడా బాబు, సంపత్, గుడ్ల సతీష్, పిట్ట వినయ్, మంతెన కృష్ణ, గాధసి సతీష్, వేణు, ఉమేష్, హరీష్, పోగుల రాజు, మధుకర్, శ్రీను, రాజు, శివ, వంశీ, శ్రీనివాస్, సురేందర్, సంపత్, వెంకటేష్, ప్రశాంత్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తాం



**పెద్దపల్లి - తెలంగాణముచ్చట్లు :**

పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఎలిగేడు మండలంలోని శివపల్లి, జూలపల్లి మండలంలోని కోనరావుపేట గ్రామాల్లో శుక్రవారం నూతన ఇందిరమ్మ ఇండ్లకు స్థానిక నాయ కులతొ కలిసి ఎమ్మెల్యే ముగ్గులు పోసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... మొదటి విడుతగా ఎలిగేడు మండలంలోని శివపల్లి, జూలపల్లి మండలంలోని కోనరావుపేట గ్రామా ల్లో ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు .త్వరలోనే పెద్దపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభిస్తామని అన్నారు.

వచ్చే నాలుగేళ్ల లో నియోజకవర్గానికి 14 వేల ఇళ్లను ప్రభు త్వం మంజూరు చేసే అవకాశం ఉందని ప్రజ లకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో భాగంగా అర్హులైన పేదలకు ఇండ్లను, అలాగే వివిధ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్టు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మంజూరి కోసం కానీ, బిల్లుల కోసం కానీ దళారులను ఆశ్రయించ వద్దని, ఎవరికి కూడా నయాపైసా ఇవ్వవద్దని ఎమ్మెల్యే సూచించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారద ర్శకంగా, అవినీతికి తావు లేకుండా ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. గతంలో బీ.ఆర్.ఎస్ పార్టీ అధికారంలో ఉన్న ప్పుడు రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు తరగు పేరిట ఒక క్వింటాలుకు 8 నుంచి 12 కిలోలు కట్‌చేసి రైతన్నలను నిలు వుదోపిడీ చేశారని,

మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, రైతన్నల పంటలో గింజ తరుగు లేకుండా చేసి రైతన్నల కు లాభం చేకూరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ, తహసీల్దార్ ఎంపీవో, కాంగ్రెస్ నాయకులు సమా రాజేశ్వర్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు, జూలపల్లి మార్కెట్ చైర్మన్ గండు సంజీవ్, పుల్లూరి వేణుగోపాల్ రావు, లోక జలపతి రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి రాంగోపాల్ రెడ్డి, దారబోయిన నర్సింగ్ యాదవ్, కొమ్ము పోచాలు, హర్షణపల్లి వెంకటేశ్వర్ రావు, అమ్ముల రాజమల్లు, మెతుకు కాంతయ్య, దుగ్యాల రాం చందర్ రావు, పొట్యాల శంకర్, సిరికొండ కొమురయ్య, గంగిపెల్లి చొక్కయ్య, రాజరామ్ రెడ్డి, అనంత రెడ్డి, హనుమంత్ రెడ్డి, కుమార్, సంజీవ్, స్వామి, ఈర్ల స్వామి, కనుకుంట్ల అంజి, లబ్దిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

**ధర్మారం - తెలంగాణముచ్చట్లు :**

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కందులను విక్రయించి లబ్ధి పొందాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రైతులను కోరారు. ధర్మారం మార్కెట్ యార్డ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మారం మండలంలొని 29 గ్రామాల్లో సుమారు 1000 ఎకరాలలొ కంది పంటను సాగు చేస్తున్నారని, రైతులు 12 శాతం తేమ ఉండేలా , కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చి ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు 7550 రూపాయల మద్దతు దర పొందాలని, దళారులను నమ్మి మోస పొవద్దని రైతులను కొరారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా కందుల కొనుగోలు కేంద్రాన్ని ధర్మారం మార్కేట్ యార్డులో ఎర్పాటు చేయడం జరిగిందని జిల్లాలోని కంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధర్మరం మండలంలోని గ్రామాలలొ రెండు లక్షల లోపు రుణమాఫీ కాని రైతుల జాబితాను తహసీల్దార్ ,మండల వ్యవసాయ అధికారులు తయారు చేసి నివేదిక ఇవ్వాలని , నివేదిక ఇచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్ ద్వారా సీఎం దృష్టికి నా వంతు బాధ్యతగా తీసుకెళ్లి ఉగాది లొపల పరిష్కార మయ్యేలా కృషి చేస్తానని అన్నారు. గత బిఅర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, మద్దతు ధర ఇవ్వలేదని, రైతు కష్ట పడి పండించిన ధాన్యాన్ని ఇస్టాను సారంగా కటింగ్ చేసి నిలువున ముంచడమే కాకుండా మిల్లర్లతొ కుమ్మక్కై నిలువు దొపిడీ చేసారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గింజ తరుగు లేకుండా చేసి రైతన్నలకు లాభం చేకూర్చుతన్నామని అన్నారు .సన్న వడ్లకు బొనస్ రాని రైతులకు కూడా బొనస్ వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. మీరు ఒట్లేస్తేనె గెలిచానని మి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానని, పని చేసినప్పుడే ప్రజలు గుర్తిస్తారని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మేల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అనంతరం ధర్మారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన దర్బార్ కేఫ్ ను ప్రారంభించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ– పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ధర్మారం వ్యవసాయ మార్కెట్లో నూతన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.. జిల్లాలో 169 ఎకరాలలో కంది పంట సాగు చేస్తున్నారని , సుమారు 1000 క్వింటాళ్ల వరకు కందులు వచ్చే అవకాశం ఉందని , జిల్లాలోని రైతులందరికీ వెసులు బాటు కల్పించి ధర్మారంలో ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు 12 శాతం తేమ ఉన్న కందులను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు 7 ,550 రూపాయలు పొందాలని , దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఈ అవకాశాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎండి వఖిల్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, మార్కెట్ బిజినెస్ మేనేజర్ మనోహర్, సెంటర్ ఇంచార్జి శ్రీనివాస్, వ్యవసాయ మార్కేట్ కార్యదర్శి సరోజ, మార్కేట్ కమిటి డైరెక్టర్ లు ఎలగందుల అశొక్, గందం మహిపాల్, అలువాల రాజేశం, శ్రీనివాస్ ,కాంపెల్లి రాజేశం, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు, అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో సఖీ కేంద్రం భవనం ప్రారంభించాలి

**-పాత ఆసుపత్రి భవనం కూల్చివేతకు పటిష్ట కార్యాచరణ**
**-మానసిక దివ్యాంగులకు అందించే సహాయంపై నివేదిక తయారు చేయాలి**
**- పెద్దపల్లి పట్టణంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**





**పెద్దపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**

పెద్దపల్లి పట్టణంలో నిర్మించిన సఖి కేంద్రం భవనాన్ని త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పెద్దపల్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన సఖి కేంద్రం భవనాన్ని, సమీపంలో ఉన్న బాలుర అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను, బండారికుంట లోని మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని, జూనియర్ కళాశాల లోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని, ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి పట్టణంలో సఖీ కేంద్ర భవన నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ప్రజాప్రతినిధుల సమయం తీసుకుని త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. పెద్దపల్లిలోని బండారి కుంటలో ఉన్న మానసిక దివ్యాంగుల కేంద్రంలో వారికి అవసరమైన వసతులు కల్పించాలని, ప్రభుత్వం తరపు నుంచి అందించే సహాయ కార్యక్రమాలపై నివేదిక అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరు, పరీక్ష హాల్ లోకి విద్యార్థులను అనుమతించే ముందు ప్రాపర్ గా చెక్ చేస్తున్నారా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి లోని ప్రభుత్వ పాత ఆసుపత్రి భవనాన్ని కూల్చివేసేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. పాత ఆసుపత్రిలోని రోగులను నూతనంగా నిర్మించిన 42 పడకల ఆసుపత్రి, మాత శిశు ఆసుపత్రులకు పేషెంట్లను తరలించడం జరిగిందని, పాత ఆసుపత్రి స్థానంలో నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం ఆహారం, రోగులకు అందజేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వివరాలు సిస్టంలో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి రవీందర్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అభిప్రాయ పడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకొని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) వారి ఆధ్వర్యంలో హనుమకొండలోని పాపడమ్స్ కన్వెన్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅ తిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో అతివల పాత్ర కీలక మని సామాజిక ఆర్థిక రాజకీయలో మహిళల భాగస్వామ్యం పెరగాలని జీడబ్ల్యూఎంసి శానిటేషన్ విభాగంలో సగం వరకు పారిశుధ్య సిబ్బంది మహిళలే నని కష్టపడి పనిచేస్తూ నగరాన్ని శుభ్రం చేయడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారని బల్దియా తరపున మెప్మా కు చెందిన విభాగం లో సుమారు 1 లక్ష 15 వేల మంది మహిళలు ఎస్ హెచ్ జీ బృందాల్లో సభ్యులుగా ఉన్నారని వారికి ఆర్థిక పరిపుష్టి అందించడానికి ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా లోన్‌లను అందించి ప్రోత్సాహం అందిస్తున్నామని బ్యాంకర్ లు ప్రస్తుతం లోన్‌ల పరిమితి పెంచి అందజేయాలని కోరారు. ఇంతే కాకుండా నగరానికి సంబంధించి మంత్రి ఏంపితో పాటు వరంగల్ హన్మకొండ జిల్లా ల కలెక్టర్లు కమిషనర్‌గా తాను వివిధ విభాగాల్లో ఉన్నతాధికారులుగా మహిళలు వారి సేవలు అందిస్తున్నారని బల్దియా అడ్మినిస్ట్రేటివ్ విభాగం లో కూడా అనేక మంది మహిళలు విధులు నిర్వహిస్తున్నారని పెన్షన్ లకు సంబంధించి ఒంటరి మహిళా వితంతు వృద్ధాప్య పెన్షన్‌ల అందజేతలో సమస్యలు లేకుండా చూడాలని బ్యాంకర్‌లకు కమిషనర్ ం జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి మన్నూర అసీబా ను కమిషనర్ బ్యాంకు ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. ఈ కార్య క్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పలు గుల సత్యం ఏజిఎంలు మహేష్ శ్రీరామ్ ఆగ్రో ఇన్చార్జి జీవన్ కుమార్ రాజు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ఓటమికి కారణం ఎవరు?

మొదటిపేజీ తరువాయి

కేంద్రంలోని ముఖ్య నాయకులు, రాష్ట్ర నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే బీజేపీ రాష్ట్ర పార్టీకి కొత్త సారధి నియమితుడవుతాడని కమలం సీనియర్లు చెబుతున్నారు. ఈ విజయం ఇచ్చిన జోష్‌తో రానున్న రోజుల్లో బీజేపీ అధికార పీఠం దక్కించుకునే దిశగా సాగుతుందని చెప్పక తప్పదు. ఆ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీ కుల గణన పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడటం కూడా పార్టీకి నష్టం చేకూర్చింది. అంతే కాకుండా ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు అన్యాయం జరిగిందని ఇందుకు కాంగ్రెస్ పార్టీయే కారణమంటూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేసిన కామెంట్స్ కూడా కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో కొంత నష్టం చేశాయని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఉత్తర తెలంగాణలోని 19 మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, పీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రచారంలో భాగస్వామ్యుల య్యారు , కాని రిజల్ట్ భిన్నంగా రావడంతో ఎన్నికలను ఎదుర్కొనే విషయంలో వ్యూహ, సమన్వయ లోపం జరిగిందన్న చర్చ హస్తం నేతల్లో సాగుతోంది.

## ఐపీఎస్ అధికారుల బదిలీ

మొదటిపేజీ తరువాయి

ఆదిలాబాద్ ఎస్పీగా అఖిల్ మహాజన్, యాదాద్రి భువనగిరి డీసీపీగా అక్షాన్స్ యాదవ్, రాజన్న సిరిసిల్ల ఎస్పీగా మహేశ్ బాబాసాహెబ్, మంచిర్యాల డీసీపీగా ఏ భాస్కర్, సూర్యాపేట ఎస్పీగా నరసింహ, హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీగా శిల్పవల్లి, ఎస్ఐబీ ఇంటెలిజెన్స్ ఎస్పీగా సాయి శేఖర్, పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్, సీఐడీ ఎస్పీగా రవీందర్ బదిలీ అయ్యారు.

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై విచారణ..

మొదటిపేజీ తరువాయి

హైకోర్టులో మూడు పిటిషన్లు కొట్టివేశారని, మరి కొన్ని ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాస నానికి మేఘా సంస్థ తరపు న్యాయవాది ముకుల్ రోహత్కి తెలిపారు. కాగా, అక్రమాలు జరిగాయని స్పష్టంగా కనిపిస్తున్నందున వెంటనే స్వతంత్ర దర్యా ప్తుకు ఆదేశించాలని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విజ్ఞప్తి చేశారు. సవివరంగా వాదనలు విన్న తర్వాత స్వతంత్ర దర్యాప్తు అంశాన్ని నిర్ణయిస్తామని సీజేఐ పేర్కొన్నారు. వాదనల అనంతరం తదుపరి విచారణను మే 13 నుంచి ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేశారు.

## పభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది

మొదటిపేజీ తరువాయి

విమర్శించారు. వాటన్నిం టినీ గాడిన పెడుతూ తమ ప్రభుత్వం అభి వృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ఎక్కడ తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నా రు. ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని ఆలస్యమైనా నిలబెట్టుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

## కాల్ సెంటర్ స్కామ్ గుట్టు

మొదటిపేజీ తరువాయి

ల్యాప్ ట్యాప్‌లు, 52 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.."పే పాల్ నకిలీ కాల్ సెంటర్ కేసులో 63 మందిని అరెస్ట్ చేశాం. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 50 మందితో పాటు 11 మంది హైదరాబాదీలను అదుపులోకి తీసుకున్నాం. 63 మందిని కోర్టులో హాజరుపరిచాం. వారికి రిమాండ్ విధించింది కోర్ట్. ఇంగ్లీష్ భాషపై పట్టు ఉన్నందునే కాల్ సెంటర్‌లో ఉద్యోగం ఇచ్చారు. జాదు రూపేష్‌తో కలిసి కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది మనస్వి. డబ్బు కోసం కాల్ సెంటర్‌లో అమ్మాయిలతో బిజినెస్ చేస్తోంది. పే పాల్ పేరుతో అమెరికన్లకు నకిలీ ఈమెయిల్స్ పంపుతారు. ఈ మెయిల్స్‌కు రెస్పాండ్ అయిన అమెరికన్ల నుంచి డబ్బులు వసూలు చేస్తారు. ఇప్పటి వరకు వందల కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు గుర్తించాం. కొట్టేసిన డబ్బుంతా క్రిప్టో కరెన్సీలో మార్చింది ముఠా. పే పాల్‌లో నకిలీ కాల్ సెంటర్ లో పని చేస్తున్న ఉద్యోగులను నిర్బంధంలో పెట్టింది మనస్వి. పీజీ హాస్టల్‌లో ఉద్యోగులను పెట్టి ప్రతిరోజు రాత్రి కాల్ సెంటర్‌కు తరలిస్తోంది. 8 గంటలపాటు బలవంతంగా పని చేయించి తర్వాత హాస్టల్‌కు పంపుతుంది మనస్విని" అని పోలీసులు వెల్లడించారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**అనకాపల్లి, తెలంగాణ ముచ్చట్లు**

అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం కోసవాని పాలెం గ్రామంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తుని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న (17) సృజన, గురువారం సెకండ్ ఇయర్ ఎగ్జామ్ రాసి ఇంటికి వచ్చినప్పటి నుంచి డల్గా ఉంది. శుక్రవారం ఉదయం తండ్రి గ్రామంలో ఓ ఫంక్షన్కి వెళ్లి రాగా ఇంట్లో ఫ్యాన్కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ రాయవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి







**- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హనుమకొండ,తెలంగాణముచ్చట్లు :**

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శుక్రవారం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని హనుమకొండ జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సునీతలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఫ్లోరెన్స్ నైటింగెల్ చిత్రపటానికి కలెక్టర్ ప్రావీణ్య, డాక్టర్ రాంకుమార్ రెడ్డి, సునీత పూలమాల వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అమ్మాయిలు పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. బాలికలు ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు సాగాలన్నారు. విద్యార్థినులు చదువులు, ఉద్యోగాల్లోనూ ముందు నిలవాలన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఢిల్లీకి వెళ్లి సివిల్స్ కోచింగ్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత సేవలు అందించే వృత్తులలో నర్సింగ్ ఒకటని, క్లిష్ట పరిస్థితుల్లోనూ సేవలం దించడంలో నర్సుల సేవలు ఎంతో ప్రాముఖ్యమైనవని అన్నారు. మహిళా దినోత్సవం నేప థ్యంలో కళాశాల విద్యార్థినులు అద్భుతంగా నృత్యాలు చేశారని, మహిళా దినోత్సవ ఏర్పాట్లు చాలా బాగున్నాయని అన్నారు. కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు శక్తిమంతులు, ధైర్యవంతులు అని అన్నారు. మహిళలు ఎంతోమంది ప్రపంచ వ్యాప్తంగా భిన్న రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని అన్నారు.నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు వివిధ రంగాలలో రాణిస్తూ ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని అన్నారు. విద్యార్థినులు ఉన్నత స్థానం సాధించాలని ఆకాంక్షించారు. మహిళా దినోత్సవ నేపథ్యంలో కళాశాల విద్యార్థినులు స్పందిస్తూ తమ తల్లిదే స్ఫూర్తి అని పేర్కొన్నారు. తాము జీవితంలో లక్ష్యం చేరేందుకు తల్లి ప్రోత్సాహంతో ముందుకు సాగేలా స్ఫూర్తిని స్తుందన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు మహిళల గొప్పదనం తెలియజేస్తూ ప్రదర్శించిన నృత్యాలు కేరింతలు పెట్టించాయి. నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా పకడ్బందీ చర్యలు

**జిడబ్ల్యుఎంసి,తెలంగాణ ముచ్చట్లు :**

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా నీటి సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకాడే తో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి వేసవిలో బల్దియా పరిధిలోని 66 డివిజన్లో మంచినీరు సరఫరాకు రూపొందించిన కార్యచరణ ప్రణాళికలపై సమీక్షించి పక్కా గా నిర్వహించుటకు మేయర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవి కాలంలో బల్దియా పరిధిలోని దాదాపు పది లక్షల జనాభా కు ధర్మసాగర్ సమ్మర్ స్టోరీ ట్యాంక్ నుండి ఫిల్టర్ బెడ్ ల ద్వారా మంచినీరు అందించనున్న నేపథ్యంలో ఇటీవల తాను ధర్మసాగర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను సందర్శించానని, వచ్చే మూడు మాసాలకు వరకునగర ప్రజలకు సరిపడ నీరు అందు బాటులో ఉన్నాయని, ఇంజనీరింగ్ అధికారులు వాటర్ లెవెల్స్‌ను నిత్యం పర్య వేక్షిస్తుండాలని అన్నారు. అవస రమైతే జిల్లా కలెక్టర్ ద్వారా ఇరిగేషన్ అధికారులకు లేఖ రాయాలన్నారు. ఈ సందర్భంగా 66 డివిజన్లో మంచినీటి సక్రమ నిర్వహణకు రూపొందించిన అన్యువల్ మెయింటెనెన్స్, సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రతిపాదనలను డివిజన్ల వారీగా మేయర్, కమిషనర్ లు సమీక్షించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేస్తూ వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మహా నగరంలోని దేశాయిపేట, కాకతీయ యూనివర్సిటీ, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ల లో ఉన్న మరమ్మత్తులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని, అవసరమైన రసాయనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు .గ్రేటర్ వరంగల్ నుండి 66 డివిజన్లో ఎద్దడి లేకుండా కచ్చితంగా మంచినీరు అందాలని ముఖ్యంగా స్లం ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నీటి సరఫరా జరగాలని, ఉన్న బోర్లను ఫ్లషింగ్ చేయడంతో పాటు నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా జరిగేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేటర్ వరంగల్ వ్యాప్తంగా గత వేసవిలో మాదిరిగా ముఖ్యమైన కూడళ్ళు, జనావాస ప్రదేశాల్లో తక్షణమే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తూ చలివేంద్రాల నిర్వహణకు వ్యక్తిని నియమించాలన్నారు. ఈ సమీక్షలో బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు మహేందర్, రవికు మార్, సంతోష్ బాబు, మాధవి లత, డిఇలు, ఏఈలు పాల్గొన్నారు.

## విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళలు

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**

ముందు తరాలతో పోల్చుకుంటే ప్రస్తుత తరంలో మహిళలు విభిన్న రంగాల్లో ముందు వరుసలో నిలుస్తున్నారని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి. నిర్మల గీతాంబ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మల గీతాంబ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు వెనుకబడి లేరని, అన్ని రంగాల్లో ముందు నిలుస్తున్నారని అన్నారు. ముందు తరాలతో పోల్చుకుంటే విభిన్న రంగాల్లో ముందున్నా మన్నారు. కలెక్టర్లు, పోలీస్, తదితర ఎన్నో ఉద్యోగాలు మొదలుకొని ఆకాశం వరకు మహిళలు ఎన్నో అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందు నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఎందులోనూ తీసుపోలేరని, ఉద్యోగాలు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, అందుకు కలెక్టర్లు, తదితర ఎంతోమంది ఉద్యోగులే నిదర్శనం అని అన్నారు. ఒకరి కొకరు గౌరవించుకున్నప్పుడే సమాజం ఎంతో ముందుకు వెళ్తుందన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా పోరాడాలన్నారు. మహిళలు జీవిత మార్గంలో లక్ష్యాన్ని కష్టపడి సాధించాలన్నారు. మనం కష్టపడి సాధించిన ప్రగతి ప్రస్థానాన్ని నెమరు వేసుకున్నప్పుడు ఎంతో సంతోషంవేస్తుందన్నారు. విభిన్న రంగాలలో రాణిస్తున్న మహిళలు మరెంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఎన్నో అవరోధా లను దాటి ఉన్నత స్థానంలో నిలిచినందుకు మహిళా అధికారులు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. హను మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి మహిళా ఒక రోల్ మోడల్ అని పేర్కొన్నారు. సమాజంలో పురుషులే మహిళా దినోత్సవం నిర్వహించినప్పుడే అసలైన మహిళా దినోత్సవం అని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులను ప్రోత్సహించినప్పుడు మరింత సమర్థవం తంగా విధులు నిర్వర్తిస్తారని అన్నారు. భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్, కల్చరల్ పోటీలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు, ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో, కుటుంబ వ్యవస్థలో మహిళలే కీలకమని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని అన్నారు. సమాజంలో స్త్రీల పట్ల వివక్షను రూపుమాపే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అన్ని రంగాలలో మహిళలను ప్రోత్సహించాలన్నారు. టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు మాట్లాడుతూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ వరంగల్ జిల్లాల మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. వివిధ పోటీలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. వివిధ బాధ్యతలలో ఎంతో ఒత్తిడి ఉండే మహిళా ఉద్యోగులు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా మరింత ఉత్సాహన్ని కలగజేస్తాయన్నారు . తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్లో కీలక బాధ్యతల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మల గీతాంబ, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను శాలువాలు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృ ద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, మహిళా అధికారులు నీరజ, అనురాధ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపట్టాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు న్యూస్**

ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులలో వాటికి పేమెంట్ జరిగి ప్రక్రియ పూర్తయ్యే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి లతో కలిసి మున్సిపల్, కుడా, జిల్లా పంచాయతీ, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్, కుడా, జిల్లా పంచాయతీ శాఖలలో ఇప్పటి వరకూ పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్ కారణాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ఎన్ని బృందాలను ఏర్పాటు చేశారని, దరఖాస్తుల పరిశీలనలో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వార్డు కార్యాలయాలలో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలన్నారు. హెల్ప్ డెస్క్ ల ద్వారా ఎల్ఆర్ఎస్ పేమెంట్ పై ప్రచారం జరగాలన్నారు. కుడా పరిధిలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఎంపీవోలు చర్యలు చేపట్టాలని, పేమెంట్ జరిగిన రెండు రోజుల్లో ఎల్ -1 దశ నుండి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లాలో తాగునీటి సరఫరాపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గ్రామాలు, ఆవాసాలు సరిపోను తాగునీరు అందుతుందా అని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్, పరకాల మున్సిపల్ తో పాటు గ్రామాలు ఆవాసాల్లో తాగునీరు సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాకు



సంబంధించి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ఈ వేసవిలో రానున్న రెండు మూడు నెలల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన ప్రణాళికలతో నీటి సరఫరా చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ మల్లేశం, కుడా పిఓ అజిత్ రెడ్డి, సిపిఓ రవీందర్ రడేకర్, డీఎల్పిఓ గంగ భవాని, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు



**జూలైవాడ, తెలంగాణ ముచ్చట్లు :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను హనుమకొండ జులైవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాడు ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. భాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ అనాది కాలము నుండి భారత దేశంలో స్త్రీకి అత్యున్నత స్థాయిలో గౌరవ మర్యాదలు ఉన్నాయని అన్నారు. మహిళను దైవీ శక్తిగా పూజించిన దేశం మనదన్నారు. ప్రస్తుత యుగములో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో దీటుగా రాణిస్తూ తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయినులైన అరుణ కుమారి, ప్రేమలత,అపూర్వ, జ్యోతి, అమితాదేవి,శ్రీలక్ష్మి, రజిత, జోస్ఫిన్ తో పాటు మహిళా కర్మచారిని షాజహాన్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవముల ఆహ్వానం



**భూపాలపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**

రేగొండ మండలంలోని కోడవటంచ (కోటంచ) శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం యందు బ్రహ్మోత్సవాలు మార్చి 09 తేదీ నుండి 16వ తేదీ వరకు జరుగు బ్రహ్మోత్సవాలకు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావును ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను ఆలయ ఈవో మహేష్,చైర్మన్ బిక్షపతి ఆధ్వర్యంలో అందించి జాతర వేడుకలు పాల్గొనాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మడమ తిప్పకుండా

## ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నాం



**- ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ధర్మారం - తెలంగాణ ముచ్చట్లు :**

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం మడమ తిప్పకుండా ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నామని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మారం మండలం బంజేరుపల్లి తండ-( బి )గ్రామంలో ప్రజాపాలనలో భాగంగా పైలట్ ప్రాజెక్టులో మంజూరు అయినా ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంకు స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ ముగ్గు పోసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ బంజేరుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు వెళ్లడం జరుగుతుందని,అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న బంజేరుపల్లి తండ గ్రామంలో ఈ రోజు ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ నిర్వహించడం జరిగిందని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇచ్చే బాధ్యత నేనే తీసుకుంటానని, ఇండ్ల నిర్మాణం విషయంలో కూడా ఎక్కడ అవినీతికి తావు లేకుండా విడతల వారీగా డబ్బులను నేరుగా లబ్దిదారుల ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి బోర్ వెల్ అవసరం ఉందని తెలుపగ ఎసిడిపి నిధుల నుండి ఒక బోర్ వెల్ ను మంజూరు చేసి 2 రోజుల్లో బోర్ వేయించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం మడమ తిప్పకుండా ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని,2 లక్షల రూపాయల రుణమాఫీ కానీ వారికి కూడా రుణమాఫీ చేసి తీరుతామని,సన్న వడ్ల బోనస్ కూడా రైతుల ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎండి వఖీల్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎఎంసి చైర్మన్ రూప్లానాయక్, మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# హనీమూన్‌కి చెక్కేసిన జంట

తెలంగాణ ముచ్చట్లు, సినిమా :

రెండేళ్లుగా ప్రేమలో మునిగి తేలిన నాగచైతన్య, శోభిత ధూళిపాళ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. సమంతతో విడాకుల తర్వాత రిలేషన్ షిప్‌లో ఉన్న ఈ జోడి డిసెంబర్ 4న కుటుంబసభ్యుల సమక్షంలో గ్రాండ్‌గా పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తర్వాత హనీమూన్ కంటే ప్రొఫెషన్‌కే ప్రాధాన్యత ఇచ్చి నాగచైతన్య... 'తండేల్' షూటింగ్‌ను పూర్తి చేశాడు. రీసెంట్‌గా మూవీ గ్రాండ్ విక్టరీని సొంతం చేసుకోవడంతో కలెక్షన్ల సునామీ సృష్టించింది. నాగచైతన్య కెరీర్‌లో బెస్ట్ మూవీగా నిలిచింది. దీంతో ఆ సంతోషాన్ని డబుల్ చేసుకునేలా... నాగచైతన్య భార్యతో కలిసి విదేశాలకు చెక్కేశాడు. పెళ్లి తర్వాత చై, శోభిత ఇంటర్నేషన్ టూర్‌కు వెళ్లిన ఫోటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ప్రెజెంట్ యూరప్ ట్రిప్‌కు సంబంధించిన ఫోటోలను శోభిత షేర్ చేసుకున్నారు. అందమైన లోకేషన్స్‌ను ఆస్వాదించడంతో పాటు నచ్చిన ఫుడ్ ను తింటూ ఎంజాయ్ చేయడంతో పాటు 'వైబ్స్' అంటూ క్యాప్షన్ ఇచ్చిన ఫోటోలు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. సింపుల్ లుక్స్‌లో కనిపించిన ఈ జోడీ ఫోటోలను చూసిన నెటిజన్లు కొత్త జంట క్యూట్‌గా ఉందంటూ క్రేజీ కామెంట్స్ పెడుతున్నారు. త్వరలోనే నాగచైతన్య కొత్త సినిమాకు కమిట్ అవ్వనున్నాడు. కార్తీక్ వర్మ దండుతో పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో మూవీ చేయనున్నాడు. దీంతో మళ్లీ షూటింగ్స్‌తో బిజీగా మారే ఛాన్స్ ఉండటంతో... భార్యతో సరదాగా గడిపేందుకు విదేశాలకు చెక్కేశాడు. ఇటు శోభిత కూడా బాలీవుడ్, వెబ్ సీరిస్‌లు, హాలీవుడ్ మూవీలతో బిజీగా ఉంది. దీంతో షూటింగ్స్‌కు గ్యాప్ రావడంతో భర్త తో కలిసి చిల్ అవుతోంది. మరోవైపు శోభితా, చై కాంబోలో ఒక మూవీ వస్తే చూడాలని ఉందని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.





లగ్జరీ ఫ్లాట్స్‌ను విక్రయించిన

## ప్రియాంక చోప్రా?

తెలంగాణ ముచ్చట్లు, సినిమా :

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్లలో ఒకరైన పీసీ.. 2017లో హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అక్కడ తనకంటే పదేళ్లు చిన్నవాడైన ప్రముఖ పాప్ సింగర్ నిక్ జొనాస్‌ను వివాహం చేసుకొని లాస్ ఏంజెల్స్‌లో సెటిల్ అయిపోయింది. ప్రస్తుతం హాలీవుడ్‌తోపాటు బాలీవుడ్, టాలీవుడ్ చిత్రాల్లోనూ నటిస్తోంది. మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో ప్రియాంక చోప్రా కథానాయికగా ఖరారైన విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ కోసం ప్రస్తుతం భారత్‌కు వచ్చారు పీసీ. ఈ క్రమంలో ముంబైలో రూ. కోట్ల విలువైన ఆస్తులను ప్రియాంక అమ్మేసినట్లు తెలిసింది. అంధేరీ వెస్ట్ ఏరియాలో ఉన్న నాలుగు లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌ను రూ.16.17 కోట్లకు విక్రయించినట్లు ఇండెక్స్ ట్యాప్ నివేదించింది. లోఖండ్వాలా కాంప్లెక్స్‌లోని ఒబెరాయ్ స్కై గార్డెన్స్ లోని 18వ అంతస్తులో ఉన్న మూడు ఫ్లాట్‌లు వరుసగా రూ.3.45 కోట్లు, రూ.2.85 కోట్లు, రూ.3.52 కోట్లకు అమ్ముడయ్యాయి. ఇక 19వ అంతస్తులో ఉన్న జోడి యూనిట్ అయిన నాలుగో ఫ్లాట్ రూ.6.35 కోట్లకు విక్రయించినట్లు తెలిసింది. ఈ నాలుగు ఫ్లాట్స్‌పై స్టాంప్ డ్యూటీ కింద రూ.83 లక్షలు చెల్లించినట్లు సదరు నివేదికలు పేర్కొన్నాయి.

# విశ్వంభర మూవీని మరోసారి వాయిదా వేశారుగా..!



తెలంగాణ ముచ్చట్లు, సినిమా :

కుర్ర హీరోలతో పోటీ పడుతూ మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఒక సినిమా సెట్స్‌పై ఉండగానే తర్వాతి సినిమా డైరెక్టర్‌ని కన్ఫాం చేసేస్తున్నారు చిరు. ఈ మధ్య మెగాస్టార్ పాత దర్శకులితో కాకుండా యువ డైరెక్టర్స్‌తో కలిసి పని చేస్తున్నారు. కొత్త కథలతో వారు వస్తున్నారు. మూవీ ఫ్రెష్ ఫీలింగ్ కలిగిస్తుంది, అందుకే వారితో చేస్తున్నానని ఓ సందర్భంలో చెప్పారు. అయితే ప్రస్తుతం చిరంజీవి బింబిసార- ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో విశ్వంభర చిత్రం చేస్తున్నారు. మెగాస్టార్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో ఈ మూవీని సోషియో ఫాంటసీగా ఈ మూవీ తెరకెక్కుతుంది. గత కొద్ది రోజులుగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కావాలి. కాని వీఎఫ్ఎక్స్ విషయంలో డిలే కారణంగా వాయిదా పడుతూ వస్తుంది. అయితే మూవీని ఏప్రిల్, మేలో విడుదల చేయాలని టీమ్ భావించిన చిత్రం మరికొన్ని రోజులు వాయిదా పడేలా కనిపిస్తుంది. ఆగస్ట్‌లో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఆగస్ట్ 22న చిరంజీవి బర్త్ డే సందర్భంగా మూవీ విడుదల చేయబోతున్నట్టు తెలుస్తుంది. అయితే డిలేకి కారణం వీఎఫ్ఎక్స్ అని తెలుస్తుంది. గతంలో ఓ కంపెనీకి ఇవ్వగా అవి సరిగా రాకపోవడంతో మూవీని మరి కొన్ని రోజులు వాయిదా వేయబోతున్నారట. విశ్వంభర టీజర్ వచ్చాక చాలా మంది వీఎఫ్ఎక్స్ విసయంలో పెదవి విరిచారు. దీంతో చిరంజీవి విశ్వంభర చిత్రాన్ని కాస్త లేట్ అయిన మంచి క్వాలిటీతో రిలీజ్ చేయాలని అనుకుంటున్నారట. ఇక ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష నటిస్తుంది. వీరితోపాటు ఈషా చావ్లా, ఆషికా రంగనాథ్ వంటి హీరోయిన్స్ కనిపించనున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం చిరంజీవి కెరీర్‌లోనే తొలి పాన్ ఇండియా మూవీగా రూపొందుతుంది. ఈ సినిమాని చిరంజీవి చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ మూవీ తర్వాత చిరు అనీల్ రావిపూడి దర్శకత్వంలో చేయనున్నాడు.

# ఆమని కీలక పాత్ర పోషించిన నారి ఎలా ఉందంటే

తెలంగాణ ముచ్చట్లు, సినిమా :

సినిమా రివ్యూ: 'నారి'

విడుదల తేది: 7-3-2025

నటీనటులు: ఆమని, వికాస్ వశిష్ఠ, కార్తికేయ దేవ్, నిత్య శ్రీ, మౌనిక రెడ్డి, ప్రగతి, కేదార్ శంకర్, ప్రమోదినీ, రాజమండ్రి శ్రీదేవి, ఛత్రపతి శేఖర్, నాగ మహేశ్, సునయన తదితరులు.

సాంకేతిక నిపుణులు:

కెమెరా: వి రవికుమార్, భీమ్ సాంబ

మ్యూజిక్ – వినోద్ కుమార్ విన్ను

ఎడిటర్ – మాధవ్ కుమార్ గుల్లపల్లి

నిర్మాత – శ్రీమతి శశి వంటిపల్లి

దర్శకత్వం – సూర్య వంటిపల్లి

విమెన్ ఓరియెంటెడ్ చిత్రాలు తీసే సాహసం చాలా తక్కువమంది మేకర్స్ చేస్తుంటారు. అలాంటి ఓ అరుదైన ప్రయత్నం చేశారు దర్శకుడు సూర్య వంటిపల్లి. ఆమని కీలక పాత్రలో మహిళ సాధికారత, సమస్యలు ఇతివృత్తంలో ఆయన తెరకెక్కించిన చిత్రం 'నారి' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఏ మేరకు ఆకట్టుకుందో చూద్దాం.

కథ:నగరంలో ఓ అమ్మాయిపై జరిగిన హత్యాచారం కేసు న్యాయవాది శారద (ప్రగతి) టేకప్ చేస్తుంది. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని తపన పడుతుంది. నేరం చేసిన నిందితుల్లో మంత్రి భూపతి (నాగమహేశ్) కొడుకు ఉంటాడు. అయినా లెక్క చేయని లాయర్ శారద బాధితురాలికి న్యాయం చేసేందుకే ముందడుగు వేస్తుంది. ఆమె లైఫ్‌లో కలిసిన ఓ దీర మహిళ భారతి(ఆమని, మౌనిక రెడ్డి) జీవితాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుంటుంది. ఆ భారతి ఎవరు? ఆమె కథేంటి. చిన్నప్పటి నుంచి కష్టాల మధ్య పెరిగిన భారతి ఎదుర్కొన్న కష్టాలు ఏంటి, వాటిని ఆమె ఎలా అధిగమించింది. మృగాళ్లు మరోసారి ఆడపిల్ల వైపు కన్నెత్తి చూడకుండా భారతి చేసిన త్యాగం ఏంటి ఆమె చూపించిన పరిష్కారం ఏంటి అనేది తెరపై చూడాలి.

విశ్లేషణ: ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి జీవితంలో ప్రతి దశలోనూ కష్టాలు కామన్‌గా ఉంటాయి. చిన్నప్పుడు తండ్రి, పెళ్లయ్యాక భర్త, తల్లయ్యార పిల్లలు ఇలా మహిళ ఏదో ఒక రూపంలో జీవిత కాలం కష్టాల కడలిని దాటుకు రావాలి అన్నట్లుగానే సమాజంలో తీరు ఉంది. ఇలాంటి నేపథ్యంలో పుట్టి పెరిగిన అమ్మాయి భారతి కథ ఇది. తన జీవితంలో తండ్రితో మొదలైన ఇబ్బందులు, ఆ తర్వాత ప్రేమించి మోసం చేసిన వ్యక్తి పెట్టిన కష్టాలను దాటుకుని గుండె రాయి చేసుకుని జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకున్న తీరును దర్శకుడు తెరపై చూపించాడు. ఇందులో స్ఫూర్తిని కలిగించే అంశం ఇది. మహిళలపై అఘాయిత్యాలు అనే అంశంపై ఎన్నో చిత్రాలు వచ్చాయి. అయితే ఇందులో దర్శకుడు చూపించిన పాయింట్. సమస్యకు పరిష్కారం కొత్తగా ఉంటుంది. ఫాస్ట్ కల్చర్‌లో యువత చెడు దారుల్లోకి పోతున్నారన్నది ఇందులో ఆసక్తికరంగా తెరకెక్కించారు. దారి తప్పిన కొడుకుకు తల్లి ఎలాంటి గుణపాఠం నేర్పింది అనేది

ఈ చిత్రంలో గొప్పగా చెప్పుకొనే మరో అంశం. క్లైమాక్స్‌లో ఆమె చెప్పిన గుణపాఠం ఏంటనేది రివీవ్ చేస్తే ఫీల్ మిస్ అవుతుంది. ఆ సీన్ ఎలాంటి మూరు?లుకైనా భావోద్వేగానికి లోను చేస్తుంది. నటీనటుల పనితీరు: ఈ చిత్రానికి తెరవెనుక దర్శకుడు హీరో అయితే తెరపై హీరో ఆమని. భారతి పాత్రలో ఇమిడి పోయింది. నటిగా తనకున్న అనుభవాన్ని టీచర్ భారతి పాత్రలో ఆమె చూపించింది. ప్రతి సన్నివేశంలోనూ భావోద్వేగాన్ని పండించింది. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే టీచర్‌గా, గాడి తప్పిన కొడుకును దార్లోకి తీసుకురావాలని ఆశపడే తల్లిగా ఆమని నటన అద్భుతం. భారతి యుక్త వయసు క్యారెక్టర్‌లో నటించిన మౌనిక రెడ్డి, ఆపాత్రకు న్యాయం చేసింది. నిత్య శ్రీ విద్యార్థిని అర్చనగా ఆకట్టుకుంటుంది. వికాస్ వశిష్ఠ క్యారెక్టర్ రివీల్ చ్టేస్త సస్పెన్స్ పోతుంది. ఈ పాత్రకు వికాస్ బాడీ లాంగ్వేజ్ బాగా సెట్ అయ్యింది. ప్రగతి, ప్రమోదినీ, ఛత్రపతి శేఖర్, కార్తికేయ దేవ్ తమ పాత్రలకు న్యాయం చేశారు. ఇక టెక్నికల్ విషయానికొస్తే.. సినిమాటోగ్రఫీ బాగుంది. చిన్న బడ్జెట్ చిత్రం అయినా క్వాలిటీ విషయంలో నిర్మాత ఎక్కడా తగ్గలేదు. సెకెండాఫ్‌లో ఎడిటర్ కాస్త కత్తెర వేసుకుంటే బాగుండేది. వినోద్ కుమార్ సంగీతం సినిమాకు ఎసెట్. ఇందులో దర్శకుడు తీసుకున్న పాయింట్, చెప్పిన సందేశం మంచిదే. కొన్నింటిని మాత్రం సోసోగా రాసుకున్నాడు. కథకు తగ్గట్టు స్క్రీన్ ప్లే రాసుకోవడంలో సూర్య వంటిపల్లి విఫలం అయ్యాడనే భావన కలుగుతుంది. ఈ తరహా కాన్సెప్ట్‌తో సినిమా అంటే ప్రతి సీన్ క్యూరియాసిటీ కలిగించేలా ఉండాలి. ఎందుకంటే క్లైమాక్స్‌లో బలమైన పాయింట్ ఉంది కాబట్టి. కమర్షియల్‌గా వర్కవుట్ అవుతుందా లేదా అన్నది పక్కన పెడితే చక్కని సందేశం మాత్రం ఇచ్చాడు దర్శకుడు. ప్రస్తుత సమాజం చూడదగ్గ సినిమా ఇది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala, Dharmasag Hanmakonda, 506151.Editor:BOLLEPAKA RAJESH. RNI:TELTEL/2013/ 88710. Contact: 9493669669. Email: telanganamuchatlu.in@gmail.com.Website : www.telanganamuchatlu.in